11-07-2025
శుక్రవారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 03 | సంచిక : 48 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

## ఒకే రోజున 2.28 లక్షల మందితో

# మెగా పీటీఎం



పాఠశాల ఎలా ఉంది. పాఠాలు ఎలా చెబుతున్నారు. సౌకర్యాలు ఉన్నాయా లేదా, తల్లికి వందనం వచ్చిందా లేదా ఇలా చాలా విషయాలు వారితో చర్చించారు. వారితో ఫొటోలు కూడా దిగారు. విద్యార్థి దశ నుంచి ఓ గోల్ పెట్టుకొని చదవాలని విద్యార్థులకు చంద్రబాబు సూచించారు. పరిస్థితులు ఒకప్పుడులా లేవని ఇప్పుడు కచ్చితంగా భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యావ్యవస్థల్లో మార్పులు తీసుకొస్తున్నట్టు వెల్లడించారు.

■ మెగా పీటీఎంలో చంద్రబాబు, లోకేష్

**జయభేరి, అనంతపురం, జూలై 10:**

ఆంధ్రప్రదేశ్‌లో మెగా పీటీఎం 2.0లో ఆసక్తికరమైన సీన్ కనిపించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పీటీఎంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉద్యోగులు, అధికారులు, దాతలు, పూర్వ విద్యార్థులు ఇలా అందర్నీ ఒకే వేదికపై తీసుకొచ్చేందుకు ఈ పీటీఎం నిర్వహించింది ప్రభుత్వం. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ పాఠశాలకు వెళ్లారు. అక్కడ తల్లిదండ్రులతో ముచ్చటించారు. విద్యార్థులతో కలిసి కబుర్లు చెప్పారు. వారి ఆసక్తులు, ఆలోచనలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ పీటీఎం కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు విద్యార్థులకు పాఠాలు చెప్పారు. సాంఘీశాస్త్ర ఉపాధ్యాయుడిగా మారిన చంద్రబాబు "వనరులు" అనే పాఠాన్ని బోధించారు. విద్యార్థులతో కలిసి నారా లోకేష్ కూడా ముందు బెంచ్‌లో కూర్చొని పాఠాలు శ్రద్ధగా విన్నారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారి మార్కులు, చదువుపై ఆరా తీశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర వ్యక్తులతో మాట్లాడుతూ పాఠశాల ఎలా ఉంది. పాఠాలు ఎలా చెబుతున్నారు. సౌకర్యాలు ఉన్నాయా లేదా, తల్లికి వందనం వచ్చిందా లేదా ఇలా చాలా విషయాలు వారితో చర్చించారు. వారితో ఫొటోలు కూడా దిగారు. విద్యార్థి దశ నుంచి ఓ గోల్ పెట్టుకొని చదవాలని

...మిగతాది 2 లో



# మంత్రిమండలిలో తీర్మానం

**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం తీర్మానించింది. ఇందుకు సంబంధించి ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.**

**జయభేరి, హైదరాబాద్ :**

స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలన్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆ అంశంపై ముఖ్యమంత్రి అధ్యక్షతన డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం చర్చించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానించింది. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గత మార్చి నెలలో జరిగిన సమావేశాల్లో బిల్లులకు శాసనసభ ఆమోదించి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి నివేదించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ఇప్పటివరకు జరిగిన 18 మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలును సమావేశం చర్చించింది. గతంలో 23 శాఖలకు సంబంధించి 327 అంశాలపై నిర్ణయాలు తీసుకుంది. వాటిల్లో 321 నిర్ణయాలు అమలు జరగ్గా మిగిలిన ఆరింటిపై మంత్రిమండలి అవసరమైన వివరణను ఇచ్చింది. ఇకనుంచి ప్రతి రెండు వారాలకు ఒకసారి విధిగా మంత్రివర్గం సమావేశం కావడమే కాకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్ణయాల అమలును సమీక్షించాలని తీర్మానించింది. రాష్ట్రంలోని 306 గోశాలల నిర్వహణపై సమగ్రమైన పాలసీని తీసుకురావాలని నిర్ణయించారు. చివరి దశలో అసంపూర్తిగా ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను సత్వరం పూర్తి చేయాలని చేయాలని మంత్రిమండలి నిర్ణయించింది.

## గంభీర బ్రిడ్జి కూలడంపై సమగ్ర దర్యాప్తు చేయాలి

■ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ డిమాండ్




**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 10 :**

గుజరాత్‌లోని వడోదరలో నిన్న గంభీర బ్రిడ్జి కూలిపోయిన ఘటనపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ఈ దుర్ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారన్న ప్రియాంక గాంధీ.. భారీ బ్రిడ్జి కూలడంపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద ప్రాంతంలో రెండవ రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, అదే సమయంలో దర్యాప్తు కూడా జరగాలని ప్రియాంక గాంధీ అన్నారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఈ అంశంపై స్పందించారు. కేంద్రంలోని బిజెపి నాయకత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గుజరాత్ వంతెన కూలిపోవడం, అహ్మదాబాద్ విమాన ప్రమాదం వంటి ఇటీవలి విషాదాలు నాయకత్వ సంక్షోభం, అవినీతి, అసమర్థత ఫలితంగా జరిగాయని ఆరోపించారు.వడోదర కలెక్టర్ అనిల్

...మిగతాది 2 లో

# ప్రైవేట్ పంచాయితీ..

## ఎస్ ఐకి హైకోర్టు వార్నింగ్



**జయభేరి, హైదరాబాద్, జూలై 10:**

టీవీ యాంకర్ శిల్పా చక్రవర్తి తాజాగా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తన 32 ఎకరాల వ్యవసాయ భూమి విషయంలో ఒక ఎస్ఐ జోక్యం చేసుకుని.. తమను వేధిస్తున్నాడంటూ ఆమె కోర్టుకు విన్నవించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ శిల్పా చక్రవర్తి, ఆమె భర్త జడ కల్యాణ్ యాకయ్య తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు సదరు ఎస్ఐ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోవడాన్ని కోర్టు ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా కోరింది. సదరు ఎస్ఐకి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ వివరాలు. టీవీ యాంకర్ శిల్పా చక్రవర్తి, ఆమె భర్త.. నల్గొండ జిల్లా కుర్మేడ్ గ్రామంలో ఎనిమిది సంవత్సరాల క్రితం అనగా 2017లో కొనుగోలు చేసిన 32 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఆ తర్వాత దీనిపై వివాదం తలెత్తింది. ఈక్రమంలో తాజాగా శిల్పా చక్రవర్తి ఈల్యాండ్ వివాదంలో పోలీసుల జోక్యాన్ని సవాలు చేస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి.వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా జస్టిస్ టి.వి. వినోద్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోవడం సరికాదని జస్టిస్ వినోద్ కుమార్ సూచించారు. ఈ వివాదంలో ఎస్ఐ వ్యవహరించిన సెటిల్‌మెంట్ తీరును తప్పుపడుతూ.. నల్లగొండ జిల్లా చింతపల్లి ఎస్ఐ రామ్మూర్తితో పాటుగా.. హోం డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీపీలతో పాటుగా.. వివాదం నెలకొన్న నల్గొండ జిల్లా ఎస్పీ, దేవరకొండ డీఎస్పీకి సైతం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో సమాధానమివ్వాలని కోర్టు ఆ నోటీసులలో స్పష్టం చేసింది.శిల్పా చక్రవర్తి తన పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. 2017లో మహ్మద్ అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తికి చెందిన 32 ఎకరాల వ్యవసాయ భూమిని శిల్పా చక్రవర్తి దంపతులు కొన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా కుర్మేడ్ గ్రామంలో ఈ భూమి ఉంది. అయితే తాజాగా తమకు భూమిని అమ్మిన అజీజ్‌తో పాటుగా.. చింతపల్లి ఎస్ఐ రామ్మూర్తి కూడా తమను వేధిస్తున్నారని శిల్పా చక్రవర్తి తమ పిటిషన్‌లో వెల్లడించారు.పైగా ఈ ల్యాండ్ వివాదంలో.. ఎనిమిదేళ్ల క్రితమే అనగా

...మిగతాది 2 లో






# ముగిసిన మోడీ విదేశీ పర్యటన

**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 10:**

ప్రధాని మోదీ సుదీర్ఘ విదేశీ పర్యటన ముగిసింది. 8 రోజుల పాటు ఐదు దేశాల్లో మోదీ పర్యటించారు. ఘనా, ట్రినిడాడ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల్లో ఆయన పర్యటించి పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. నమీబియా పర్యటనతో ఆయన విదేశీ టూర్ ముగిసింది. దీంతో ఆయన ఢిల్లీ బయలుదేరారు. బ్రెజిల్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న మోదీ ఘనా, ట్రినిడాడ్, టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల్లో పర్యటించారు. లేటెస్ట్‌గా అత్యున్నత పౌర పురస్కారం 'వెల్‌విచ్చియా మిరాబిలి'తో మోదీని సత్కరించింది నమీబియా ప్రభుత్వం. మోదీ అందుకున్న 27వ ఇంటర్నేషనల్ అవార్డ్ ఇది. భారతదేశంలోని 140 కోట్ల మంది భారతీయుల తరపున ఈ పురస్కారాన్ని అందుకుంటున్నానని చెప్పారు ప్రధాని మోదీ. ఇండియానమిబియా మధ్య ఎప్పటికీ చెక్కుచెదరని చిరకాల స్నేహం ఉందని, ఈరోజు ఇక్కడ అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. తనకు ఇచ్చిన పురస్కారాన్ని నమీబియా,

...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## మెగా పీటీఎం

విద్యార్థులకు చంద్రబాబు సూచించారు. పరిస్థితులు ఒకప్పుడులా లేవని ఇప్పుడు కచ్చితంగా భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యావ్యవస్థల్లో మార్పులు తీసుకొస్తున్నట్టు వెల్లడించారు. ఇదే టైంలో విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి సీట్లు కొట్టిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థుల్లో నీట్ లాంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సీటు పొందిన విద్యార్థులకు లక్ష రూపాయలు నగదు బహుమతి అంద జేయనుంది. ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు 11 రకాల వస్తువులతో కాస్మెటిక్ కిట్స్ ఇవ్వాలని నిర్ణయించింది. సీట్లు సాధించలేక పోయిన విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ ఇవ్వబోతున్నారు. పేరెంట్ టీచర్ మీటింగ్ అనేది ఇంతవరకూ కార్పొరేట్ స్కూళ్లకు మాత్రమే పరిమితమైన ప్రక్రియ. దీన్ని ఇప్పుడు గవర్నమెంట్ స్కూళ్లలో కూడా అప్లై చేస్తోంది కూటమి ప్రభుత్వం. గత ఏడాది డిసెంబర్ ఏడున మెగా పీటీఎమ్ తొలి ప్రయత్నం విజయవంతమైంది. గురువారం సెకండ్ ఎపిసోడ్‌ను శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో నిర్వహించింది ప్రభుత్వం. విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉద్యోగులు, అధికారులు, దాతలు, పూర్వ విద్యార్థులు..ఇలా ఒకే రోజున 2 కోట్ల 28 లక్షల మందితో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ప్లాన్ చేసింది ప్రభుత్వం.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, జూనియర్ కాలేజీల్లో మెగా పీటీఎం 2.0ను ఒక ఉత్సవంలా నిర్వహించింది ప్రభుత్వం. తమ పిల్లలు చదువులో ఎంత పురోగతి సాధిస్తున్నారు..? వారి ప్రవర్తన ఎలా ఉంది? సామాజిక సమస్యలపై అవగాహన పెంచుకుంటున్నారా లేదా?.. ఇలా అనేక అంశాలపై తల్లిదండ్రులు నేరుగా తెలుసుకునే అవకాశం కల్పించడమే మెగా పీటీఎం లక్ష్యం. తల్లిదండ్రులు కూడా వారి అభిప్రాయాలను, సూచనలను ఈ వేదిక ద్వారా ప్రభుత్వంతో పంచుకునే అవకాశం కల్పించింది. ప్రతీ ఏడాది ఇదే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ సమావేశం నిర్వహించాలనేది ప్రభుత్వ సంకల్పంగా పెట్టుకున్నారు.

**పవన్ సవాల్ స్వీకరించిన లోకేష్**

రాజకీయాల్లో సవాళ్లు ప్రతిసవాళ్లు కామన్. తెలంగాణలో ఇటీవలే సీఎం రేవంత్ బీఆర్ఎస్, బీజేపీలకు సవాల్ విసరగా.. కేటీఆర్ సిద్ధమని ప్రకటించారు. ఈ సవాళ్ల రాజకీయం ఏపీకి చేరింది. అయితే ఇది రాజకీయ సవాల్ కాదు. అభివృద్ధికి సంబంధించినది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విసిరిన ఛాలెంజ్‌ను మంత్రి నారా లోకేశ్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. అసలు విషయానికొస్తే.. ఏపీలో ఇవాళ మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ జరిగింది. శ్రీ సత్యాయి జిల్లా పుట్టపర్తిలోని కొత్తచెరువు జడ్పీ స్కూల్లో ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. విద్యార్థులతో ముచ్చటించి.. వాళ్లు రెడీ చేసిన తల్లికి వందనం పోస్టర్లు, కళారూపాలను తిలకించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో చంద్రబాబు, లోకేష్ మాటామంతి కలిపారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చిన సీఎం.. మార్కులు పెంచుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. స్కూళ్లలో విద్యతో పాటు ఆటలు, యోగా నేర్పిస్తున్నామన్నారు. స్కూళ్లలో రాజకీయాలకు తావులేదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు అన్నీ స్కూళ్లలో పేరెంట్ టీచర్ మీటింగ్ జరుగుతున్నట్లు తెలిపారు. షైనింగ్ స్టార్స్ ప్రోగ్రామ్‌తో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. జగన్ హయాంలో విద్యార్థులకు నాణ్యత లేని యూనిఫామ్స్ ఇచ్చారని.. తాము అటువంటి తప్పు చేయలేదన్నారు. ప్రతి విజయం వెనక గురువు ఉంటారని.. మనకు బాధ్యత నేర్పేది అమ్మ కాబట్టి.. తల్లికి వందనం స్కీం పెట్టినట్లు తెలిపారు. ''అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ప్రధాని సూచిస్తే.. ప్రధాని పిలుపుతో కోటి మొక్కలు నాటాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సవాల్ విసిరారు. పవన్ సవాల్‌ను స్వీకరిస్తున్నా. విద్యాశాఖ ద్వారా కోటి మొక్కలు నాటుతాం'' అని లోకేశ్ తెలిపారు.అంతకుముందు సీఎం చంద్రబాబు నాయుడు టీచర్‌గా మారారు. సహజ వనరుల గురించి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. సుస్థిరమైన అభివృద్ధి సాధించాలంటే వనరుల సద్వినియోగం అవసరమని.. విద్యార్థులు చదువుకునే పాఠ్యపుస్తకాలు కూడా ఇతరులు మరోసారి వినియోగించుకునేలా జాగ్రత్తగా వాడాలని సూచించారు. విద్యుత్, నీరు లాంటి వనరుల సద్వినియోగం కూడా సామాజిక బాధ్యత అంటూ వివరించారు. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణల వైపు విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించిన సీఎం.. అందరూ ఉద్యోగాలే కాదు రాజకీయాల్లోకి కూడా రావాలన్నారు. నారా లోకేష్ బాగా చదువుకుని ఇప్పుడు రాష్ట్రానికి మంత్రి అయ్యారని వ్యాఖ్యానించారు. ప్రజలకు మంచి చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి సేవ చేయాలని సీఎం సూచించారు.

## ముగిసిన మోడీ విదేశీ పర్యటన

ఇండియా ప్రజలకు అంకితమిస్తున్నానని తెలిపారు.అంతకు ముందు బ్రెజిల్ టూర్ ముగించుకుని నమీబియా చేరుకున్న భారత ప్రధాని నరేంద్రమోదీకి ఘన స్వాగతం లభించింది. నమీబియా గడ్డపై అడుగుపెట్టిన మోదీకి సంప్రదాయ నృత్యంతో అక్కడి కళాకారులు స్వాగతం పలికారు. డోలు వాయిస్తూ వారిని ఉత్సాహపరిచారు ప్రధాని మోదీ. నమీబియా అధ్యక్షుడు నెతుంబోతో ప్రధాని ద్వైపాక్షిక చర్చలు జరిపారు. నమీబియా మొదటి అధ్యక్షుడు దివంగత డాక్టర్ సామ్ నుజోమాకు నివాళులర్పించారు.నమీబియా పార్లమెంట్ లో కూడా ప్రసంగించారు ప్రధాని మోదీ. ఆ దేశ పార్లమెంటు సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. అంతర్జాతీయంగా ఆఫ్రికాకు భారత్ ఎంతో విలువిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు. అధికారం, ఆధిపత్యాలతో కాకుండా.. సమానత్వం, భాగస్వామ్యాలతో వర్ధిల్లే భవిష్యత్తును సృష్టించుకునేందుకు ఇరుపక్షాలూ ఐక్యంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచానికి ఆఫ్రికా కేవలం ముడిసరకు వనరుగా మిగిలిపోకుండా సుస్థిరాభివృద్ధిలో ముందుండాలని ఆకాంక్షించారు. నమీబియాతో భారత్‌కు ఉన్న బలమైన చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ఆయన ప్రస్తావించారు.నమీబియా పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం అనంతరం గౌరవ సూచకంగా సభ్యులు లేచి నిలబడి చప్పట్లు కొట్టారు. నమీబియా పర్యటనతో ప్రధాని మోదీ విదేశీ టూర్ ముగిసినట్లయింది. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరారు.

## ప్రైవేట్ పంచాయితీ..


2017లోనే తాము సివిల్ కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్‌స్‌తో పాటుగా.. పోలీసు రక్షణ ఉత్తర్వులను కూడా పొందామని శిల్పా చక్రవర్తి తెలిపారు. తమకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్స్ పొందినప్పటిక కూడా ఎస్ఐ రామ్మూర్తి ఈ ల్యాండ్ విషయంలో జోక్యం చేసుకుని తమను వేధిస్తున్నాడని ఆమె కోర్టుకు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లోనే ఈ వివాదాన్ని సెటిల్ చేసుకోవాలంటూ సదరు ఎస్ఐ తమపై ఒత్తిడి తెస్తున్నారని ఆమె పిటిషన్‌లో చెప్పుకొచ్చారు.ఈ పిటిషన్‌ని విచారించిన హైకోర్టు.. ఇరువురి వాదనలను విన్న తర్వాత.. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. అలాగే తదుపరి విచారణను వచ్చేనెల అనగా ఆగస్టు 5కు వాయిదా వేశారు.

## గంభీర బ్రిడ్జి కూలడంపై సమగ్ర దర్యాప్తు చేయాలి

ధమేలియా విలేకరులతో మాట్లాడుతూ, 'ఇవాళ మరో మూడు మృతదేహాలను వెలికితీయడంతో మృతుల సంఖ్య 15కి చేరుకుంది. నలుగురు గల్లంతయ్యారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం 4 కి.మీ. మేర గాలింపు, రక్షణ చర్యలు నిర్వహిస్తున్నాయి' అని చెప్పారు. నదిలోకి పడిపోయిన రెండు వాహనాల గురించి ప్రజల నుండి వివరాలను కోరుతున్నామన్నారు. వర్షం పడుతుండటంతో, నదిలో నీటి మట్టం పెరిగిందని కలెక్టర్ తెలిపారు. అయితే, విరిగిన వంతెనపై వేలాడుతున్న ట్రక్కు గురించి అడిగినప్పుడు, 'ఇది ఖాళీ ట్యాంకర్. మేము దానిని తరలిస్తే, అది కింద పడిపోవచ్చు. సరిగ్గా కిందనే సహాయక చర్యలు జరుగుతున్నందున లారీని స్థిరంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాం' అన్నారు. ఇలా ఉండగా, బ్రిడ్జి కూలిన ఘటనలో మృతుల సంఖ్య నేడు 15కి పెరిగిందని, ఇవాళ మరో మూడు మృతదేహాలను వెలికితీసినట్లు స్థానిక అధికారులు తెలిపారు. గల్లంతైన నలుగురి కోసం గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. వడోదర ఆనంద్‌లను కలిపే భారీ గంభీర బ్రిడ్జిలో కొంత భాగం కూలిపోయి దిగువన ఉన్న మహిసాగర్ నదిలో పడిపోయిన సంగతి తెలిసిందే.

# ప్రజా ఆరోగ్యం.. పట్టేదెవరికీ..!?

**ఇటుకుల పహాడ్ గ్రామంలో మొత్తం ఓట్ల సంఖ్య 2600 ఓట్లకు గాను ప్రజలు మూడు నుంచి నాలుగు వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. మండల స్థాయిలో ఎన్ని గ్రామపంచాయతీలు ఉన్నాయి? ఎన్ని గూడాలు ఉన్నాయి ? ఎన్ని అంబులెన్స్ సర్వీస్ లో ఉన్నాయి? అనే విషయాలపై ప్రజారోగ్యంపై జయభేరి చేసిన సర్వేలో బయటపడ్డ అసలు నిజాలు కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ సీనియర్ జర్నలిస్ట్ సంధిస్తున్న సమగ్ర నివేదిక....**




**జయభేరి, హైదరాబాద్ :**

శాలిగౌరారం మండల పరిధిలో 24 గ్రామపంచాయతీలు, 19 గూడేలు ఉన్నాయి. ప్రజా ఆరోగ్యం దృశ్య గతంలో శాలిగౌరారం మండలం విశాలమైన స్వభావం కలిగి ఉన్న ప్రాంతం కాబట్టి ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకటి కావాలని కొంతమంది సామాజిక సేవ చేస్తున్న నాయకులు వాళ్ల పోరాట పటిమకు నిదర్శనంగా మాధవరానికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు అయింది. కానీ అప్పుడు ఎమ్మెల్యేగా నోముల నరసింహయ్య ఉండడంవల్ల అది ఓగౌడు గ్రామానికి వెళ్ళిపోయింది అనేది ఆనాటి సీనియర్ లీడర్ల వాదన.

వాస్తవానికి గతంలో శాలిగౌరారం మండలంలో 19 గ్రామ పంచాయతీలు 26 గూడాలు ఉండేవి. అందులో చిత్తలూరు వంగమర్తి ఇటుకులపాడు మాధవరం సౌల గూడెం బచ్చు వారి గూడెం ఇలా అనేక ప్రాంతాలకు కనీస రోడ్డు సౌకర్యాలు లేక ప్రజా ఆరోగ్యం దెబ్బతింటుంది అన్న కారణంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మాధవరానికి ఏర్పాటు చేస్తే అది కాస్త ఓగోడు గ్రామానికి వెళ్ళింది. ఇదంతా గతం. కానీ రాష్ట్రం వచ్చిన తర్వాత గత ఆర్థిక సంవత్సరానికి గాను 24 గ్రామపంచాయతీలు 19 గూడాలుగా ఇప్పుడు ఆచరణలో కొనసాగుతున్నాయి. వీటికి సంబంధించి ప్రజా ఆరోగ్యానికి మండల పరిధిలో ఒక అంబులెన్స్ సర్వీస్ నడుస్తోంది. శాలిగౌరారం మండల భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ప్రజా ఆరోగ్యం పూర్తిగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపీల చేతుల్లోకి మారిపోతుంది. ప్రభుత్వపరంగా ఇటుకుల పహాడ్ గ్రామంలో ఆర్ఎంపీలు ఇద్దరు ప్రైవేట్ గా సర్వీసులు అందిస్తున్నారు. ప్రభుత్వపరంగా ఆశ వర్కర్లు ఇద్దరు పని చేస్తున్నారు. అందులో వారికి అంతగా చదువు లేకపోవడం,వలనే అనుభవంతో పనిచేస్తున్నారు. ప్రభుత్వం అందించే ఉచిత మందులను ప్రజలకు అందివ్వడానికి ఇద్దరి సర్వీసులు సరిపోవడం లేదు. ఎందుకంటే ఇటుకుల పహాడ్ గ్రామంలో 2600 ఓట్లకు గాను ప్రజలు ప్రాథమికంగా మూడు వేల నుంచి 4000 వరకు ప్రజలు నివసించే గ్రామం. ప్రతి 1000 మందికి ఒక ఆశ వర్కర్ ను పెట్టుకున్న మినిమం నలుగురు ఆశా వర్కర్లు పనిచేయాల్సి ఉంటుంది. ఇలా లేకపోవడం వల్ల ప్రజలు ఆరోగ్యం బాధతో తట్టుకోలేక ప్రైవేటు ఆర్ఎంపీ డాక్టర్ల చేతిలో బలైపోతూ అధికంగా ధనాన్ని వెచ్చిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

వాస్తవానికి గతంలో రోడ్డు సర్వీసు సరిగా లేకపోవడం వల్ల ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వాళ్లపై ఆధారపడి మందు మాకు ఏదైతే అది ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే ఆలోచనలతో అధిక డబ్బును ఆర్ఎంపీలకు ధారపోస్తూ అప్పుల పాలవుతున్నారు. ప్రైవేటు డాక్టర్ ఇంటికి వస్తే మినిమం 100 రూపాయలు తీసుకుంటారు గోలీలకు టానిక్కులకు సూర్యాపేట నుంచి తీసుకు రావాలి అంటూ సర్వీసులను ట్రావెల్ సర్వీస్ లను ప్రజలపై మోపుతూ భారీగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇవేవీ పట్టించుకోని ప్రజలు ఆరోగ్యం కోసం అప్పుచేసి ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఏమన్నా అంటే ఇంటికి వచ్చేవాడు రాకుండా పోతాడు అనే భయం ప్రజల్లో బాగా నాటుకుపోయింది. ప్రభుత్వం అందించే ఉచిత మందులను గ్రామస్థాయిలో డిఎంహెచ్ వల్ల పర్యవేక్షణ ఎటువైపు వెళుతుందో ప్రజలకు అర్థం కావడం లేదు. ఇటుకుల పహాడ్ గ్రామంలో కనీసం నెలకు ఒకసారైనా కచ్చితంగా ఆరోగ్య కేంద్రాలు ప్రభుత్వం అందించే ఉచిత మందులు ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెంచే కార్యక్రమాలను చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఆశా వర్కర్ల సంఖ్యను కూడా పెంచాల్సిన బాధ్యత మండల డిహెచ్ఓ పరిధిలో ప్రభుత్వ వైద్య అధికారులకు విన్నవిస్తున్నారు గ్రామ ప్రజలు. ఇటుకుల పహాడ్ కు గతంలో రోడ్డు సరిగా లేకపోవడం వల్ల ఆరోగ్యం ప్రైవేట్ వ్యక్తుల్లో చేతుల్లోకి పోయి అప్పులపాలుగా మారిపోయిన బతుకులు లోకి ఇప్పుడు నూతన రోడ్డు నిర్మాణం జరుగుతున్న సందర్భంలో ఆరోగ్య విషయంలో కూడా మాకు మంచి జరగాలన్నది ప్రజల అభిమతం. ప్రజా ఆరోగ్యం ప్రభుత్వం చూపిస్తున్న చొరవ కొంత మేలు జరుగుతున్నప్పటికీ ఇంకా జరగాల్సినది చాలా ఉందనేది తేటతెల్లమవుతుంది. గ్రామస్థాయిలో ఉన్నవాళ్లు రాజకీయంగా ఎదగడమే చూస్తున్నారు కానీ ప్రజా ఆరోగ్యాన్ని పట్టించుకున్న పాపాన పోవడం లేదనేది బహిర్గతంగా వినపడుతున్న ఆరోపణ. ఇటుకుల పహాడ్ గ్రామంలో పెద్దవారితో పాటు చిన్న పిల్లలు అధికంగా ఉన్న గ్రామం కాబట్టి ఇందులోని యువత పూర్తిగా మద్యం మత్తులో మునిగి జీవితాన్ని బలి పెట్టుకుంటున్నారు. దీని ద్వారా యువత 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల్లోనే వారు తొందరగా ఆరోగ్య సమస్యలు చిక్కుకుపోయి జీవితాన్ని చిదిమేసుకుంటున్నారు. ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజా ఆరోగ్యం పూర్తిగా గాలికి వదిలేసినట్టుగానే కనిపిస్తోంది.దీనిపై ఎవరు నోరు మెదపడం లేదని కనీసం ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేయట్లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మండల పరిధిలో ఒక అంబులెన్స్ సర్వీస్ 26 గ్రామపంచాయతీలకి 19 గూడాలకి ఎలా సరిపోతుందని ఎదురవుతున్న ప్రశ్న? ఒకవైపు ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం కోసం అనేక సరికొత్త నిర్ణయాలు తీసుకుంటున్న సందర్భంలో శాలిగౌరారం మండలంలో గల ఇటుకుల పహాడ్ గ్రామానికి సంబంధించి ఆరోగ్యపరమైన విషయంలో ప్రజా ఆరోగ్యం పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మారిపోయి ఆరోగ్యం కాపాడుకోవాలంటే ఆర్థిక భారంగా మారిపోతుందని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆరోగ్య పెద్దలు ఆలోచించి ప్రజలకు అందుబాటులో వైద్య సౌకర్యాలను అందించాలని ప్రజలు కోరుతున్నారు.




**కడారి శ్రీనివాస్**
సీనియర్ జర్నలిస్ట్ (జయభేరి),
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, కవి, గాయకుడు, రచయిత, సామాజిక ఉద్యమకారులు

ఇటుకుల పహాడ్ గ్రామంలో ఆర్ ఎంపీ డాక్టర్లు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిపోతుంది. ఆర్ఎంపీ డాక్టర్లు గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగాలంటే మినిమం ఇంటర్ లేదా ఫార్మా లేదా ల్యాబ్ టెక్నీషియన్ హెల్త్ అసిస్టెంట్ గా పనిచేసిన అనుభవం ఉండాలి. ఇటుకుల పహాడ్ గ్రామంలో పనిచేస్తున్న ఇద్దరు ఆర్ఎంపి డాక్టర్లకు ఈ అనుభవం ఉందో లేదో ప్రజలు ఇవేవీ పట్టించుకోవడం లేదు. ఇందులో ఒకరికి మాత్రమే అర్హత ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇక ఇక్కడ పనిచేస్తున్న ఆర్ఎంపీ డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. అంతేకాకుండా వారు ఇచ్చిన ఇంజక్షన్ల ద్వారా చాలామందికి గడ్డలు కూడా అయినట్లు చెబుతున్నారు. మొత్తానికి ఈ గ్రామంలో ప్రజారోగ్యం ప్రైవేటు వైద్యుల చేతిలో గాలిలో దీపంగా మారుతుంది. ప్రజలు ప్రాథమిక చికిత్సకు ప్రభుత్వం అందిస్తున్న మందులు అందుతున్నాయో లేవో పట్టించుకోకుండా జలుబు చేసిన జ్వరం వచ్చిన వంటి నొప్పులు వచ్చిన వెంటనే ఆర్.ఎం.పి డాక్టర్లకు కాల్ చేస్తూ వారు అడిగిన డబ్బులు అందిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చేతిలో పని లేకుండా పోవడమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం భారంగా మారి ప్రజలు అప్పుల బారిన పడుతున్నారు.

శాలిగౌరారం మండల పరిధిలో ఒకే ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఓగోడు గ్రామంలో ఉండటం వల్ల ఆ ప్రాథమిక కేంద్రం కేవలం ఆవూరికే ఉన్నట్టుగా మారిపోతుంది. మిగతా గ్రామాల్లోని ప్రజలు ఎవరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కి వెళ్లి ఆరోగ్యాన్ని చూపించుకున్న దాఖలాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఇరుకుల పహాడ్ గ్రామంలో ప్రజల ఆరోగ్యంపై గ్రామపంచాయతీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో ప్రజలకు తెలియడం లేదు. దీంతో ఇటుకుల పహాడ్ లోని నివసిస్తున్న ప్రజలు ఆరోగ్యం కోసం అధిక డబ్బులు ఖర్చు చేసుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఆరోగ్య అధికారులు మండల పరిధిలో పనిచేస్తున్నప్పటికీ వారు అందిస్తున్న ప్రభుత్వ మందులు ఆశా వర్కర్ల ద్వారా గ్రామంలో అందరికీ అందలేకపోతున్నాయి అనేది ప్రజల వాదన.

# కదులుతున్న డ్రగ్స్ డొంక



**జయభేరి, హైదరాబాద్, జూలై 10:**

హైదరాబాద్ కొంపల్లిలోని మల్నాడు రెస్టారెంట్ డ్రగ్స్ కేసులో ఈగల్ టీం దూకుడుగా దర్యాప్తు చేస్తోంది. అతి పెద్ద డ్రగ్ రాకెట్ నడుస్తున్నట్లుగా గుర్తించారు. ఈ కేసులో కొంపల్లిలోని మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్య అన్నమనేని కీలక సూత్రధారిగా ఉన్నట్లు గుర్తించారు. సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు, ఈగల్ టీం సూర్య అన్నమనేనిను కొంపల్లిలోని మల్నాడు రెస్టారెంట్ సమీపంలో పట్టుకున్నారు. అతనిదే ఆ హోటల్. అతని కారులో జరిపినప్పుడు 10 గ్రాముల కొకైన్, 3.2 గ్రాముల OG కుష్ (గంజాయి రకం), 1.6 గ్రాముల ఎక్స్‌టసీ గుళికలు స్వాధీనం చేసుకున్నారు. కొకైన్ మహిళల చెప్పుల హీల్‌లో దాచి, గులాబీ రంగు పెట్టెలో ప్యాక్ చేసి, న్యూ ఢిల్లీ నుండి "ఫాతిమా" అనే ఫేక్ పేరుతో శ్రీ మారుతి కొరియర్ ద్వారా పంపినట్లు గుర్తించారు. విచారణలో సూర్య, 2021 నుండి 2025 వరకు డ్రగ్స్ వినియోగం నుండి పూర్తిస్థాయి సరఫరాకు మారినట్లు వెల్లడించాడు. హైదరాబాద్‌లోని ప్రముఖ పబ్‌లు ప్రిజం, ఫామ్ పబ్, బర్డ్ బాక్స్, బ్లాక్ 22, క్వేక్ అరేనా, ఎక్సోరా, బ్రాడ్‌వే వంటి చోట్ల డ్రగ్స్ వినియోగించినట్లు ఒప్పుకున్నాడు. సూర్య తన బంధువు ఫామ్‌హౌస్‌లో డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లు, హర్ష, నవదీప్ రెడ్డి వంటి వ్యక్తులతో కలిసి డ్రగ్స్ వినియోగించినట్లు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. ఢిల్లీ, బెంగళూరు, గోవాలలో నైజీరియన్ డ్రగ్ ట్రాఫికర్లు నిక్, జెర్రీ, డెజ్‌మండ్, స్టాన్లీ, ప్రిన్స్ నుండి డ్రగ్స్ కొనుగోలు చేసినట్లుగా అంగీకరించాడు. ఈగల్ టీం 9 పబ్‌లపై NDPS యాక్ట్ కింద కేసులు నమోదు చేసింది. ఈ పబ్‌లలో డ్రగ్ పార్టీల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు గుర్తించారు. వచ్చే వారం విచారణకు హాజరు కావాలని పబ్ యజమానులకు నోటీసులు జారీ చేశారు. వాక్ కోరా పబ్ యజమాని రాజా శేఖర్, కోరా పబ్ యజమాని పృథ్వీ వీరమాచినేని, బ్రాడ్‌వే పబ్ యజమాని రోహిత్ మాదిశెట్టిపై కేసులు నమోదయ్యాయి. ఈ ముగ్గురు సూర్యతో కలిసి డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లు గుర్తించారు. సూర్య తన రెస్టారెంట్, కారును డ్రగ్స్ నిల్వ సరఫరా కేంద్రంగా ఉపయోగించాడు. అతను నిక్ అనే నైజీరియన్ సరఫరాదారుడికి డిజిటల్ చెల్లింపుల ద్వారా రూ. 1.39 లక్షలు, రూ. 41,000 ATM ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసినట్లు గుర్తించారు. డ్రగ్స్ హైదరాబాద్‌లోని టెకీలు, వైద్యులు, పబ్ డైరెక్టర్లు, వ్యాపారవేత్తలకు సరఫరా చేశారు. మొత్తం 15 మంది వ్యాపారవేత్తలపై కేసులు నమోదయ్యాయి, వీరిలో యశ్వంత్, జస్వంత్, నవదీప్, పవన్, రాహుల్, విక్రమ్ రెడ్డి, తనుజ్, రోహిత్ మాదిశెట్టి వంటి వారు ఉన్నారు. ప్రిజం, ఫామ్ పబ్, బర్డ్ బాక్స్, బ్లాక్ 22, వాక్ కోరా, బ్రాడ్‌వే వంటి పబ్‌లలో డ్రగ్ వినియోగం కోసం ప్రత్యేక గదులు అందించినట్లు సూర్య పోలీసులకు చెప్పాడు. సూర్య, ఇతర అరెస్టయిన వ్యక్తులపై NDPS యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి.

# జాగృతి సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

- భద్రాచలం ఆలయ ఈవో రమాదేవిపై దాడికి ఖండన
- గ్రామాల విలీనానికి తుమ్మల చొరవ చూపాలని విజ్ఞప్తి

**జయభేరి, చర్ల, జూన్ 10 :**



భద్రాచలం చుట్టు పక్కల వున్న 5 గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖ రాస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రామాలయ భూముల వ్యవహారంలో ఆలయ ఈఓ, బీసీ బిడ్డ రమాదేవిపై పురుషోత్త పట్నం గ్రామస్తులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించిన ఆమె, ఆ 5 గ్రామాలను తిరిగి తెలంగాణలో కలిపేందుకు వెంటనే అవసరమైన చర్యలను తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చొరవ చూపాలని కోరారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు వచ్చిన కవిత, కొత్తగూడెంలో జరిగిన తెలంగాణ జాగృతి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భద్రాచలం చుట్టు ప్రక్కల వున్న 5 గ్రామాలను తెలంగాణలో కలపాలని డిమాండ్ చేస్తూ జాగృతి ఆధ్వర్యంలో ఒక రౌడ్ టేబుల్ సమావేశాన్ని కూడా నిర్వహించామన్నారు. ఫలితంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు, మంత్రి తుమ్మల వినతి పత్రం ఇచ్చారని కవిత ఈ సందర్భంగా గుర్తు చేశారు. రానున్న కాలంలో ఈ అంశంపై జాగృతి ఆధ్వర్యంలో అవసరమైన పోరాటాలు సాగిస్తామని చెప్పారు.

**42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు జీవో విడుదల చేయాలి**

బెసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ తక్షణమే జీవో విడుదల చేయాదని కవిత రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర క్యాబినేట్ మీటింగులో ఒక నిర్ణయం తెసుకోవాలన్నారు. రిజర్వేషన్లు అమలు చేసే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే, సహించేది లేదని హెచ్చరించారు. వికారాబాద్ డిక్లరేషన్ కు కట్టుబడి తక్షణమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆమె కాంగ్రెస్ నాయకులను డిమాండ్ చేశారు. రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు అసెంబ్లీలో పాసైనా, అమలకు జీవో విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. అందుకే బీసీ రిజర్వేషన్ల సాధనకు ఈ నెల 17న రైల్ రోఖో జరప తల పెట్టామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు ఈ రైల్ రోఖోలో పాల్గొని విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**ఇస్తా ఇస్తా అంటాడు ఏమీ ఇవ్వడు ...**
**వస్తా వస్తా అంటాడు చర్చకు రాడు**

ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని కవిత విమర్శించారు. ఇప్పటికీ రైతులకు రుణ మాఫీ సంపూర్ణంగా జరగలేదన్నారు. పెన్షన్లను 2 నుండి 4 వేలకు పెంచ లేదని, ఆడ బిడ్డలకు తులం బంగారం ఇవ్వ లేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఇస్తా ఇస్తా అంటాడు ఏదీ ఇవ్వడని, వస్తా వస్తా అంటాడు చర్చకు రాడని ఎద్దేవా చేశారు. తెలంగాణ అభివృద్ధి పట్ల, ప్రజల సమస్యల పరిష్కారం పట్ల రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదన్నారు. ఆయన నోటి నుండి ఒక్క సారి కూడా జై తెలంగాణ అన్న మాట రాలేదని, జై కాంగ్రెస్, జై సోనియమ్మ జపం చేయడంలోనే మునిగి తేలుతున్నారని దుయ్య బట్టారు. కేసీఆర్ పదేళ్ళ పాలనలో ప్రజలు దేనికీ అప్లికేషన్ పెట్టుకోవాల్సిన అవసరమే రాలేదన్నారు. ఇప్పుడు యూరియా కోసం రైతులు చెప్పులు లైన్లో పెట్టు కోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అసలు వ్యవసాయమంటేనే రైతులు బయపడే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఇంగరేణిని ప్రైవేటీకరిస్తే ఊరుకొనేది లేదు**

సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేస్తే, ఊరుకొనేది లేదని కవిత హెచ్చరించారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించక పోగా, గనుల ప్రైవేటీకరణకు పూనుకుంటున్నాయని ఆరోపించారు. సింగరేణిలో అవినీతి పేరుకు పోయిందని, అన్ని స్థాయిల్లో అవినీతి రాజ్యామేళుతోందన్నారు. అలాగే, భూర్గంపాడులో ఐటీసీ కాలుష్య నివారణపై దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పాల్వంచలో స్పాంజ్ ఐరన్ ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనేక పరిశ్రమలు, భద్రాచల రామాలయం వున్న ఈ జిల్లాలో ఎయిర్ ఫోర్ట్ కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందని, వెంటనే ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ అంశాలన్నిటిపై తాను శాసన మండలి సమావేశాల్లో మాట్లాడతానని చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు వీరన్న, శంకర్ నాయక్ ఆధ్వర్యంలో పలువురు జాగృతిలో చేరారు. ఎమ్మెల్సీ కవిత వారికి కండువాలు కప్పి సాదరంగా సంస్థలోకి ఆహ్వానించారు. ముందుగా ఆమెకు గిరిజన సాంప్రదాయ పద్ధతిలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.





# మీలా పొలిటికల్ స్టంట్‌కి కాదు..

- మేము ప్రజల అవసరాలకే పని చేస్తున్నాం

కేటీఆర్ విమర్శల జాబితాకు మా దగ్గర డేటా సమాధానం ఉంది. రేఖ బోయలపల్లి తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు పాయింట్ వారిగా BRS హామీలు vs కాంగ్రెస్ కార్యాచరణ వివరాలు:

**1. పెన్షన్ :** 10 ఏళ్లుగా పెంచని పెన్షన్‌ను మేమే పునఃప్రారంభించాం. ఖాళీ ఖజానా నుంచే గౌరవంగా మొదలుపెట్టాం.
**2. మహాలక్ష్మి పథకం :** RTC బస్సుల్లో ఉచితంగా తిరుగుతున్న లక్షల మహిళలే అసలైన మహాలక్ష్ములు.
**3. రుణమాఫీ :** BRS హయాంలో 70% రుణాలు మాఫీ కాలేదు. కాంగ్రెస్ రైతుకి భరోసా, బ్యాంకుకు గౌరవం కల్పిస్తోంది.
**4. రైతు భరోసా :** ఇప్పటికే 70,11,600 మంది రైతులకు రైతు భరోసా అమలు. మా పని బడ్జెట్‌తో – మీ పని ఫోటోలతో.
**5. రైతుబీమా :** పేపర్ పాలసీ కాదు. ప్రతి రైతు కుటుంబానికి తక్షణ భరోసా ఇవ్వడమే మా లక్ష్యం.
**6. బంగారం కాదు, భవిష్యత్ :** ఆడబిడ్డలకు బంగారం కన్నా రిజర్వేషన్ల రూపంలో భద్రత, గౌరవం కల్పిస్తోంది కాంగ్రెస్.
**7. స్కూటర్ పథకం :** BRS హయాంలో హామీలే మిగిలాయి. మేము బడ్జెట్‌తో, మెరిట్‌తో, పారదర్శకంగా అమలు చేస్తున్నాం.
**8. ఇళ్ల నిర్మాణం :** మీ ఇళ్లు పక్షుల గూళ్లయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్లాన్‌తో నిర్మిస్తోంది.
**9. GHMC బుల్డోజర్ :** ఇది చెత్త పాలన శుభ్రం చేసే యంత్రం. బుల్డోజర్ న్యాయంపై నడుస్తోంది.
**10. పల్లెల్లో భయం? :** మా పాలన భయాన్ని కాదు, భవిష్యత్తును పంచుతుంది. ఇది వన్ మ్యాన్ షో కాదు – ప్రజల రాజ్యం.
**11. గ్యారంటీలు :** మా గ్యారంటీలు గెజిట్‌లో ఉన్నాయి. మీ విమర్శలు గాలిలో ఉన్నాయి. మా గ్యారంటీలపై ప్రజలకు నమ్మకం ఉంది. దాన్ని మేము నిలబెట్టుకుంటాం.

ఇది కాంగ్రెస్ మాట కాదు... కార్యచరణ. ఇది ప్రజల పాలన, పటిష్ఠంగా అమలు అవుతున్న వాస్తవం. అంటూ ఘాటుగా విమర్శలు చేశారు.

# బాబు మెచ్చిన రాజేంద్రుడు






అంకితభావం, కష్టపడిపనిచేసే తత్వం, సమర్థమంతమైన నాయకత్వం.. ఇలాంటి లక్షణాలున్న నేతలు రాజకీయాలపై తనముద్ర వేయగలుగుతారు. అలాంటివారిలో నాగార్ కర్నూల్ జిల్లాకు చెందిన గంగాపురం రాజేందర్ ముందువరుసలో ఉంటారు. ఏ పార్టీలో ఉన్నా.. ఆ పార్టీ సిద్ధాంతాలకగుణంగా పనిచేయడం రాజేందర్ ప్రత్యేకత. తెలంగాణ ఉద్యమకారుడిగా, అడ్వకేట్, రాజకీయ నేతగా.. ఇలా మూడు రంగాల్లో రాణించి మంచి పేరు సొంతం చేసుకున్నారాయన. అందుకే ఇటీవల శ్రీశైలం చంద్రబాబు పర్యటనలో రాజేందర్ ప్రత్యేకార్షణగా నిలిచారు. గతంలో టీడీపీ నేతలతో సాన్నిహిత్యం ఉండటంతో చంద్రబాబు ప్రత్యేకంగా పలుకరించి బుజ్జి తట్టి అప్యాయంగా ముచ్చటించారు. కష్టపడి చేస్తే గుర్తింపు ఎప్పటికైనా ఉంటుందని నిదర్శనం రాజేందర్. ప్రస్తుతం అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

**జయభేరి, శ్రీశైలం**

# నీరు పేద కుటుంబానికి చెందిన మేరాపాక లక్ష్మి

**జయభేరి, సూర్యాపేట :**




సూర్యాపేటజిల్లా ఆత్మకూరు యస్ మండలం గట్టికల్ గ్రామం నీరు పేద కుటుంబానికి చెందిన మేరాపాక లక్ష్మి గత 3 సం.క్రితం క్యాన్సర్ తో మరణించగా, ఇప్పుడు తండ్రి రాములు గత 5 రోజుల క్రితం ప్రమాదవశాత్తు యాక్సిడెంట్లో మరణించగా తమ ఇద్దరు కుమారులు (శివ 9 సం., సాయి 5 సం.) అనాథలు అయ్యారు, ఈ పరిస్థితిలో అయిన వారు అక్కున చేర్చుకోకపోయిన, అన్నితానే అయి కులాలకు అతీతంగా మానవతా దృక్పథంతో స్పందించి రాచకొండ రమేష్ కన్న తండ్రిలాగా అక్కున చేర్చుకుని అలాన పాలన చూస్తూ మానవత్వం ఇంకా బ్రతికే ఉంది అని నిరూపిస్తున్నారు మిత్రుడు రక్ష ఫౌండేషన్ మురళి ద్వారా విషయం తెలుసుకున్న ప్రాణ దాతలు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మేరుగుమల్ల రాజ్ మంచి మనసుతో స్పందించి, ఆత్మకూరు యస్ SI శ్రీకాంత్ సారు చేతుల మీదుగా 3 నెలలకి సరిపడ నిత్యావసర సరుకులు, 5000/ రూపాయలు ఆర్థిక సహాయం, అలాగే నా మిత్రుడు నెమ్మాది రమేష్ ఇద్దరి పిల్లలకు రెండు జతల బట్టలు పంపిణీ అలాగే పుట్ట వెంకటేష్ తరుపున 1000 రూపాయలు సహాయం చేయడం జరిగింది.

ఈ గొప్ప కార్యక్రమంలో అడిగిన వెంటనే కాదనకుండా సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతూ.. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు యస్ SI శ్రీకాంత్ సారు,ప్రాణ దాతలు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మేరుగుమల్ల రాజ్, జానకిరాములు, వెంకటేష్, పాత్రికేయ మిత్రులు సైదులు, రాజ్ కుమార్, ఉపేందర్, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిని రైతు వేదికలో వదిలేసిన నలుగురు కొడుకులు

**జయభేరి, మహబూబాబాద్:**

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని భూపతి పేట గ్రామంలో కన్న తల్లిని కాదన్న కొడుకుల ఘటన గురువారం చోటుచేసుకుంది. తల్లిని సాదలేము అంటూ రైతు వేదికలో నలుగురు కొడుకులు వదిలి పెట్టారు. నలుగురు కొడుకులకు భారంగా మారిన కన్నతల్లి రైతువేదికలో తల దాచుకుంటుంది. తేలిక పాటి చద్దరితో చలికి తట్టుకోలేక వణుకుతున్న ఆమె పరిస్థితిని చూసి స్థానికులు కొడుకులు చేసిన పని పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

# పోలీస్ స్టేషన్ కు కోడి పంచాయితీ

**జయభేరి, నల్గొండ, జూలై 10:**

ఒక్కోసారి పోలీసుల మందుకు వింత కేసులు వస్తాయి. వీటికి కూడా కేసు పెడతారా అంటూ పోలీసులే ఆశ్చర్యపోతుంటారు. ఇప్పుడు నకిరేకల్ పోలీసుల ముందుకు అటువంటి కేసే వచ్చింది. రోజురోజుకు పెరుగుతున్న క్రైమ్ రేట్‌తో పోలీసులు సతమతమవుతున్నారు. ముఖ్యంగా దొంగతనాలు, దోపిడీలు, హత్యలు వంటి కేసులతో వాళ్లు బిజీ బిజీగా ఉంటారు. ఈ కేసుల పరిష్కారానికి పోలీసులు నానా తంటాలు పడుతుండగా.. నల్లగొండ జిల్లా పోలీసులకు ఓ వింత కేసు ఎదురైంది. ఈ కేసును ఎలా పరిష్కరించాలో అర్థం కాక ఖాకీలు తలలు పట్టుకుంటున్నారు. ఆ వింత కేసు ఏంటో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే.నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం గొల్లగూడెంకు చెందిన గంగమ్మ అనే వృద్ధురాలికి పెంపుడు కోడి ఉంది. ఆ కోడి ప్రతి రోజు ఆరు బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుంది. గంగమ్మ ఇంటి పక్కనే ఉన్న రాకేష్ ఇంట్లోని గడ్డివాము వద్ద గింజలు తినేది. అయితే తన గడ్డివాములో గంగమ్మ కోడి గింజలు తింటుందనే ఆగ్రహంతో రాకేష్ కర్రతో కొట్టడంతో కోడి కాళ్లు విరిగిపోయాయి. తన కోడి కాళ్లు విరగొట్టిన రాకేష్‌పై కేసు నమోదు చేయాలంటూ గంగమ్మ బోరున విలపిస్తూ నకిరేకల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇలాంటి గొడవలు సాధారణమే అంటూ కేసులు ఎందుకు..? కోడికి ఎంత రేటో చెప్పు.. రాకేశ్‌తో డబ్బులు ఇప్పిస్తామని పోలీసులు చెప్పారు.నా కళ్ళముందే నా కోడిని కర్రతో కొట్టి కాళ్లు విరగొట్టాడని.. నాకు డబ్బులు వద్దు ఏమి వద్దు రాకేష్‌కు శిక్ష పడాల్సిందేనంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. నా కోడికి జరిగినట్లు ఊళ్లో ఏ కోడికి జరగకూడదు అని గంగమ్మ పోలీసులతో వాగ్వాదానికి దిగింది.



# గురువులు సమాజానికి మార్గదర్శకులు

- ఉపాధ్యాయులను సన్మానించిన భాజపా నాయకులు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**

బాలబాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు సమాజ గమనానికి మార్గదర్శకులని భాజపా రాష్ట్ర నాయకుడు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి అన్నారు. గురువారం గురు పౌర్ణమిని పురస్కరించుకుని మున్సిపల్ భాజపా అధ్యక్షుడు కవేరి శ్రీదర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాజపా నాయకుడు పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి పాల్గొని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు జన్మనిస్తే, ఉపాధ్యాయులు జీవితాన్ని ఇస్తారని గురువులకు బ్రహ్మ స్థానం కల్పించిన ఏకైక దేశం భారత దేశం అన్నారు. విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవిస్తూ వారి మార్గదర్శకంలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అమరం మోహన్ రెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రామారావు, ఉపాధ్యక్షుడు మలిగే శ్రీకాంత్ రజక, శాంతన్ రెడ్డి, మహిళమోర్చా అధ్యక్షురాలు నవనీత, ప్రదీప్, చింటూ, రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ

- పేద విద్యార్థులకు సహాయం




**జయభేరి, చర్ల, జూన్ 10 :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోనీ సింగసముద్రం లో గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఖమ్మం వారిచే జి.యస్.యస్ చైల్డ్ కేర్ సెంటర్ కు చెందిన సుమారు 135 మంది నిరు పేద విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ పుస్తకాలు ,పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అతిథులుగా చర్ల ఎస్ ఐ పి కేశవ్ ,పంచాయతీ కార్యదర్శి టి సురేష్ లు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేయడం చాలా సంతోషకరమని ఇటువంటి సహాయాన్ని అందిస్తున్నటువంటి గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు . మారుమూల గిరిజన గ్రామాలలో పేద పిల్లలకు సహాయం చేయడానికి ఇటువంటి స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావడం చాలా అభినందనీయమనీ, సంస్థ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు దొడ్డా ప్రభుదాస్ ,స్వచ్ఛంద సంస్థ సిబ్బంది మురళీకృష్ణారెడ్డి, సతిష్.లెనిన్ కాలనీ హచ్ ఎం జి చిట్టి బాబు ,తుర్రం .వీర భద్రం చైల్డ్ కేర్ సెంటర్ సిబ్బంది పూజారి .లక్ష్మణ్ .రాజమ్మ పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


# హెలిప్యాడ్ స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండలో 20వ తేదీ రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలకు దేవరకొండ నియోజక వర్గానికి విచ్చేయుచున్న సందర్భంగా నేడు దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీపంలో హెలిప్యాడ్ సభ స్థలాన్ని దేవరకొండ ASP మౌనిక, RDO రమణా రెడ్డతో కలిసి స్థలమును పరిశీలించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ పర్యవేక్షణలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాచారం, కొండపోచమ్మ డైరెక్టర్లకు సన్మానం



**జయభేరి, గజ్వేల్, జూలై 10 :**

గజ్వేల్ మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్ నాచారం దేవస్థానం డైరెక్టర్ గా, ప్రజ్ఞాపూర్ కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుండు లక్ష్మణ్ కొండ పోచమ్మ దేవస్థానం డైరెక్టర్ గా ఎన్నికైన సందర్భంగా గురువారం గజ్వేల్ లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు,పద్మశాలి సంఘం పట్టణ యువజన అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి జగ్గయ్య గారి శేఖర్ కు, గుండు లక్ష్మణ్ కు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్దార్ ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు కైవసం చేసుకుంటుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశలవారీగా అమలు చేస్తూ ప్రజల ఆదరణ పొందుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉన్నదని, రాబోయే స్తానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, జంగం రమేష్ గౌడ్, గుంటుకు శ్రీనివాస్, అజార్, షాహిద్,కప్ప భాస్కర్, రాజు గౌడ్, గాజుల శ్రీనివాస్, అరుణ్, చెప్యాల శేఖర్ , శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.



## లూపిన్ ఫార్మా పరిశ్రమ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలి

- ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ:**

పరవాడ ఫార్మసిటీలో 8వ తేదీ అర్ధరాత్రి జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేసి తీవ్ర అస్వస్థతకు గురైన పి లక్ష్మణ్ కుమార్ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జరిగిన ప్రమాద విషయాన్ని యాజమాన్యం బయట ప్రపంచానికి తెలియకుండా వ్యవహరించిందని దీని మీద విచారణ చేసి వైద్య సేవలు పొందుతున్న కార్మికుడికి మెరుగైన వైద్య సేవలతో పాటు కార్మికుడు కోలుకునే వరకు పూర్తిస్థాయి వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని భద్రతా ప్రమాణాలు వైఫల్యం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని గని శెట్టి అన్నారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, రెవెన్యూ, పోలీస్ శాఖ విచారణ చేసి చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు.

## పేదల కష్టంలో ఆపద్బాంధవుడిగా తనవంతు సహాయం అందిస్తున్న జల్లారపు శ్రీనివాస్



**జయభేరి, చర్ల, జూలై 10 :**

చర్ల మండల పరిధిలోని పూజారిగూడెం గ్రామానికి చెందిన పూజారి కిరణ్ స్వరూప దంపతుల రెండవ సంతానం దీపక్ చందు, బాబు వయసు ముప్పై నెలలు, ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరి లివర్ ఇన్ఫెక్షన్ కారణంగా ప్రాణాపాయ స్థితిలో ఖమ్మం పట్టణంలోని అంకుర హాస్పిటల్ లో ఐసియూ లో ఎడ్మిట్ చేయడం జరిగింది. తండ్రి కిరణ్ వెల్డింగ్ పని, తల్లి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న వారి స్తోమతకు మించి అప్పు చేసిమరీ లక్షా యాభై వేల రూపాయలు ఖర్చు చేసి గత నాలుగు రోజులుగా వైద్యం అందిస్తున్నారు.ఈ విషయం తెలుసుకున్న కత్తిగూడెం గ్రామంలోని కిసాన్ పురుగు మందుల షాప్ యజమాని జల్లారపు శ్రీనివాస్ తనకు తెలిసిన డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్, స్నేహితులు, రైతులు ఇలా సుమారు అరవై మంది దాతల సహకారంతో ఇరవై ఒక్క వేల రూపాయలు (21000/)జమచేసి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. జల్లారపు శ్రీనివాస్ గతంలోనూ కష్టాల్లో ఉన్న పేదలకు సహాయం చేసేవారని తను చేసేది చిన్న వ్యాపారం ఐనా పేదల కష్టాల్లో తనవంతు సహాయం చేయడంలో ముందుంటారని, పేదింట్లో పుట్టి పెరిగి, పెద్ద చదువులు చదువుకొని ప్రతీ పేదింటి ఆపదలో అండగా నిలుస్తున్న జల్లారపు శ్రీనివాస్ ను పలువురు ప్రముఖులు, మండల ప్రజలు ప్రశంసిస్తున్నారు.

## ఘనంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్



**జయభేరి, పరవాడ:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపట్టిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ పరవాడ బి సి కాలనీ పాఠశాల నందు ఘనంగా జరిగింది. విద్యార్థుల పేరెంట్లతో పాఠశాల ఆవరణ లో పండగ వాతావరణం నెలకొన్నది. పాఠశాలలో గత విద్యా సంవత్సరం లో ఎన్ టి పి సి చేపట్టిన బాలభారతి సమ్మర్ క్యాంపు లో ముగ్గురు విద్యార్థులు రితిక, ఫాతిమా, కళాన్విత కు ఫ్రీ సీటు వచ్చింది. మరియు రెసిడెన్సియల్ పాఠశాల ప్రవేశ పరీక్ష ద్వారా 5 వ తరగతి కి ముగ్గురు విద్యార్థులు సెలెక్ట్ అయ్యారు.ముఖ్య అతిధిగా పాల్గొన్న పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి సభ ను ఉద్దేశించి మట్లాడుతూ విద్యార్థులు గొప్ప విద్యావేత్తలుగా మంచి పౌరులుగా తీర్చి దిద్దాలి అని తల్లితండ్రులను ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల ప్రసంగాలతో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పైలా శ్రీనివాసరావు , సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు,మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, నాయుకులు పైలా రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, చల్లా కనకారావు,పైలా టీవీ అప్పారావు, పైలా హరీష్, పైలా రాధాకృష్ణ, పైలా అప్పలనాయుడు, వెన్నెల సన్యాసిరావు,పి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## డా.ఎంజీఆర్ డిగ్రీ కాళాశాలకు కోటి రూపాయలు మంజూరు

**జయభేరి, ముమ్మిడివరం :**


ముమ్మిడివరం లో డాక్టర్ ఎంజీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు కోటి రూపాయలు ముమ్మిడివరం శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు మంజూరు చేయించారు. ముమ్మిడివరం ప్రధాన కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల దుస్థితిని కొద్దిరోజుల క్రితం కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ తో ముమ్మిడివరం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధురీలు చర్చించారు.

డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో కళాశాల అభివృద్ధికి కృషి చేయడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు, జూనియర్ కళాశాల ప్రాంగణంలో మూడు ఎకరాలు స్థలాన్ని డిగ్రీ కళాశాలకు భూసేకరణ చేయించడం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు జరిగిందన్నారు. ఐదేళ్లలో నియోజవర్గం పరిధిలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు.

# పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్ డే రోజున పసికందు మృతి

- డాక్టర్ నిర్లక్ష్యం వహించారంటూ బంధువుల ఆరోపణ
- ప్రైవేట్ హాస్పటల్ పై చూపించే శ్రద్ధ పేషంట్లపై చూపిస్తే బాగుండేది
- నొప్పులు తట్టుకోలేక ఆపరేషన్ చేయమని ప్రాధేయపడిన పట్టించుకోని ఆసుపత్రి సిబ్బంది
- డాక్టర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బంధువుల డిమాండ్
- పాల్వంచ పోలీస్ స్టేషన్లో భర్త ఫిర్యాదు.. వెంటనే ఎఫ్ఐఆర్ చేసిన పోలీసులు
- ప్రభుత్వ ఆసుపత్రి డ్యూటీలో ఉంటూనే ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు చేస్తున్న డాక్టర్





**జయభేరి, పాల్వంచ, జూన్ 10 :**

పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో జూన్ ఒకటో తారీకు పసికందు డాక్టర్ నిర్లక్ష్యానికి మృతిచెందడంతో జీర్ణించుకోలేని తల్లిదండ్రులు బంధువులు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి పసికంది మృతికి కారకురాలైన డాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐడిఓసి పాల్వంచలో సబ్ కలెక్టర్ వేణుగోపాల్ కు వినతిపత్రం అందించిన మృతి చెందిన పసికందు తండ్రి. పూర్తి వివరాల్లోకి వెళితే పాల్వంచ పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ నిండు గర్భిణీ మనోవేదన పలువురిని శ్లోక సముద్రంలో ముంచింది. లక్ష్మీదేవి పల్లి మండలం తోక భాంధల గ్రామానికి చెందిన కరుణ (23) ప్రసవం కోసం వచ్చిన గర్భిణీని పలు విధాలుగా ఇబ్బందికి గురి చేస్తూ నొప్పులు వస్తున్నాయని తట్టుకోలేక ఆపరేషన్ చేయమని రెండు చేతులు జోడించి ప్రాధేయపడిన కనికరించని డాక్టర్ ఆసుపత్రి సిబ్బంది. ఆరోగ్యంగా ఉన్న పసికందు మరికొద్ది సేపట్లో ప్రసవించవలసి ఉండగా నిర్జీవంగా ఆ బిడ్డను తల్లికి అప్పగించారు. తల్లి బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని మానిటరింగ్ చేస్తూ నార్మల్ డెలివరీ చేయాలని చెప్పి డాక్టర్ అనూష ప్రభుత్వ ఆసుపత్రి నుండి బయటికి వెళ్లారని తరువాత నిండు గర్భిణీ అయిన కరుణాకు నొప్పులు రావడంతో భరించలేక తల్లడిల్లిన స్థితిలో హడావుడి చేసి ఆపరేషన్ థియేటర్ కు తీసుకెళ్లి బిడ్డ చనిపోయాడు అని బంధువులకు అప్పగించి చేతులు దులుపుకున్నారు. ఆపరేషన్ కి స్ట్రక్చర్ పై తీసుకు వెళుతున్న ఆయాలు డబ్బులు డిమాండ్ చేయడం కోసమేరుపు.ఇదేమిటని బంధువులు ప్రశ్నించగా నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నించామని తప్పని పరిస్థితుల్లో ఆపరేషన్ చేశామన్నారు. కానీ పసికందు ప్రాణాలను కాపాడలేకపోయామని పలు కారణాలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేశారు.కరుణ బంధువులు డాక్టర్ను నిలదీయగా సాధారణంగా ఇలాంటి సంఘటనలు జరగవని ఎక్కడో ఒకటి ఇలాంటి పరిస్థితి జరుగుతుందని సినిమాలో చెప్పిన రీతిగానే నిజజీవితంలో కూడా తెలియజేసిన డాక్టర్లు అందుకు మా బాధ్యత కాదంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పారంటూ బంధువులు ఆరోపించారు.గర్భిణీ స్త్రీ ప్రసవ నొప్పులు తట్టుకోలేక ఆపరేషన్ చేయమని ప్రాధేయపడిన డాక్టర్ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వహించారని, జాగ్రత్త వహించి ఉంటే బిడ్డ చనిపోయేవాడు కాదని, డాక్టర్ నిర్లక్ష్యంతో తల్లికి కూడా ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.9 నెలలు బిడ్డను మోస్తూ బిడ్డకు జన్మను ఇవ్వాలని ఎంతో ఆశతో వచ్చిన వారికి నిరాశ ఎదురయింది. నిర్జీవంగా ఉన్న శిశువును వారికి బహుమతిగా ఇచ్చారు.

ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్ ఆసుపత్రి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని బంధువులు పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇటువంటి సంఘటనలు మరల చోటు చేసుకోకుండా డబ్బు ఉన్నవారికి లేనివారికి ఒకే విధంగా వైద్యం చేయాలని, పసికందు మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే రోజు జూన్ 1 రాత్రి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన స్టేషన్ సిబ్బంది. బుధవారం నిర్జీవ శిశువును పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. చనిపోయిన శిశువును తీసుకొని తిరుగు ప్రయాణమైన బంధువులు. భద్రాద్రి జిల్లా అంటేనే గిరిజన జిల్లా అటువంటి జిల్లాలో గిరిజనులకు అడుగడుగున అన్యాయమే జరుగుతుంది. కలెక్టర్ భార్య ఇక్కడ డెలివరీ అయింది మనల్ని కూడా మంచిగానే చూస్తారని ఆశతో ఇక్కడికి వచ్చిన వారికి చేదు అనుభవం ఎదురయింది. ఉన్నవారికి ఒక తీరుగా లేని వారికి ఒక తీరుగా ఇక్కడ చూస్తారు అని నిరూపించిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు సిబ్బంది. ఏది ఏమైనాపటికి ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా డాక్టర్ పై హాస్పిటల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్న బంధువులు స్నేహితులు. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించే డాక్టర్లు ఆన్ డ్యూటీ లో ఉంటూనే వారి ప్రైవేట్ హాస్పటల్ కు వెళ్తున్నారని డ్యూటీలో ఉండి వారి ప్రైవేట్ ఆసుపత్రి పైనే ఎక్కువ శ్రద్ధ చూపిస్తారని. దాన్లో భాగంగానే చిన్నారి మృతి చెందిందని ఆరోపిస్తు మాకు తగిన న్యాయం చేయాలని కోరుతూ ఐ డి ఓ సి కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ ను కలిసి పూర్తిగా వివరించి వారికి వినతిపత్రం అందజేసిన కుటుంబ సభ్యులు.





# మహిళా సాధికారతపై కాంగ్రెస్ సర్కార్ ప్రత్యేక దృష్టి

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక రుణ సహాయం
- కొడకండ్లలో. "ఇందిరా మహిళా శక్తి" సంబరాలు
- గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్

**జయభేరి, గజ్వేల్, జూలై 10 :**



మహిళా సాధికారకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం కొడకండ్లలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించిన సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని క్రమంలో ప్రతి పథకాన్ని వారి పేరిటనే వర్తింపజేస్తున్నట్లు గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా ఆర్థిక రుణ సహాయం అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏపిఎం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. మండలంలోని 669 మహిళా సంఘాలకు రూ కోటి అరవై లక్షల వడ్డీ లేని రుణాలు మంజూరైనట్లు తెలిపారు. అలాగే రూ15 లక్షలు గోడౌన్ నిర్మాణానికి మంజూరి అయినది కాగా, రూ 11 లక్షలు మేకలు, పొటేల్లు, పెరటికోళ్ళ పెంపుకు కేటాయించినట్లు చెప్పారు. వీటితోపాటు మహిళా సంఘాలకు పెట్రోల్ పంపులు, ఆర్టిసి బస్ లు కేటాయిస్తుండగా, అర్ధాంతరంగా మరణించిన మహిళా సభ్యులకు లోన్ భీమా రూపంలో రూ లక్షా 52 వేలు వారి సంఘం రుణ ఖాతాకి జమ అయినట్లు చెప్పారు. అమ్మ ఆదర్శ కమిటీలో విఓ అధ్యక్షురాలు ఛైర్మన్ గా ఉండి పాఠశాలలలో అవసరమైన మౌళిక సదుపాయాలు, వసతులు, మరమ్మత్తులు చక్కగా చేపట్టారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్స్ మహిళా సంఘ సభ్యులతో కుట్టించి అదాయం వచ్చేట్లు చేసామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంజి యాదవ్, నేతలు నక్క రాములు గౌడ్, రమేశ్ గౌడ్, పంచాయతి సెక్రటరీ శ్రీకాంత్, సిసిలు క్రిష్ణలీల, పుష్పలత, నిర్మల, స్వామి, శ్రీనవాస్, నాగరాజు, విఓఏలు రేణుక, స్వప్న, శ్రీలత, రాధిక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించగా, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

## హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కేసు ఐదుగురు అరెస్టు

**జయభేరి, హైదరాబాద్:**

హెచ్సీఏ అధ్యక్ష ఎన్నికల్లో జగన్మోహన్రావు నకిలీ పత్రాలు సమర్పించినట్లు పోలీసులు నిర్ధారించారు. జగన్మోహన్రావు శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించారు. గౌలీపురా క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ సి కృష్ణ యాదవ్ సంతకం ఫోర్జరీ అయింది. కృష్ణ యాదవ్ సంతకాన్ని శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ కవిత ఫోర్జరీ చేసినట్లు సమాచారం. ఫోర్జరీ పత్రాలను జగన్మోహన్రావుకు కవిత అందించింది. నకిలీ పత్రాలుతోనే జగన్మోహన్రావు హెచ్సీఏ అధ్యక్షుడిగా ఎన్నికైయాడు. హెచ్సీఏ నిధులు దుర్వినియోగం చేశారని జగన్ మోహన్ రావు పై అభియోగం నమోదయింది. నిధులు దుర్వినియోగంపై టి సి ఏ అధ్యక్షుడు గురువారెడ్డి సిఐడి కి ఫిర్యాదు చేసారు. దాంతొఓ సిఐడి అధికారులు దర్యాప్తు చేపట్టి హెచ్ సి ఏ లో అక్రమాలు గుర్తించారు. జగన్మోహన్రావుకు కోశాధికారి శ్రీనివాసరావు సీఈవో సునీల్ సహకరించినట్లు ఆధారాలు లభించాయి. దాంతో జగన్మోహన్రావు ,శ్రీనివాసరావు, సునీత్, రాజేంద్ర యాదవ్, కవిత అరెస్ట్ అయ్యారు.

## చిత్స్వరూప!

తే.గీ. పంచ క్లేశము లున్నవి వాస్తవముగ
త్రివిధ దుఃఖములు కలుగు తీరు కివియె
హేతు వనియును యెరిగితి హేయము
లుగ
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

ఆ.వే. ఓపి కర్మలన్ని ఒప్పుగా నుండగ
చేయవలయు నెపుడు చేవ గల్గి
అంతరంగమంత సంతసమును జెందు
చేరి కొలుతు నిన్ను చిత్స్వరూప!

తే.గీ. ప్రకృతి పురుష వివేకము బడయుటేను
జ్ఞాన మనుచును తెలిసెను చక్కగాను
మోక్షసాధన కిదియె మొదటిమెట్టు
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

ఆ.వె. విద్యలెన్నొ నేర్చి విజ్ఞులైనను గాని
బ్రహ్మమెరుగ వలెను బ్రతుకు నందు
నిత్యమదియె మరియు సత్యము నదియేను
చేరి కొలుతు నిన్ను చిత్స్వరూప!

తే.గీ. బుద్ధి మాలోన ఎట్టుల శుద్ధియగును
అందులకు జ్ఞానమే ముఖ్యమనుచు తెలిసె
అపుడు సద్బుద్ధి కలుగును ఆత్మయందు
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!



జక్కని వేంకటరాజం
సిరిసిల్ల. 94400 21734

# సంతకం ఫోర్జరీ చేసి.. హెచ్‌సీఏ అధ్యక్షుడయ్యాడు

- జగన్మోహన్ రావు అరెస్టుపై సీఐడీ ప్రకటన
- ఫ్రీ టిక్కెట్ల కోసం బెదిరించిన జగన్మోహన్ రావు అరెస్ట్




**జయభేరి, హైదరాబాద్ జూలై 10:**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావును సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. నకిలీ పత్రాలను ఉపయోగించి ఆయన అధ్యక్ష పదవిని పొందినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్య తీసుకున్నట్లు సీఐడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయనతో పాటు మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు.సీఐడీ వెల్లడించిన వివరాల ప్రకారం, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరుతో జగన్మోహన్‌రావు నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ క్లబ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కవిత, గౌలిపురా క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి సి. కృష్ణయాదవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆ పత్రాలను జగన్మోహన్‌రావుకు అందజేశారు. వాటిని ఆధారంగా చేసుకుని ఆయన హెచ్‌సీఏ ఎన్నికల్లో పోటీ చేసి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.ఆ తర్వాత హెచ్‌సీఏలో నిధుల దుర్వినియోగం జరిగిందని టీసీఏ అధ్యక్షుడు గురువారెడ్డి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మోసంలో జగన్మోహన్‌రావుకు హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాస రావు, సీఈవో సునీల్ సహకరించినట్లు దర్యాప్తులో తేలిందని సీఐడీ పేర్కొంది. దీంతో జగన్మోహన్‌రావు, శ్రీనివాసరావు, సునీల్, రాజేందర్ యాదవ్‌తో పాటు ఫోర్జరీకి పాల్పడిన కవితను కూడా అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

**ఫ్రీ టిక్కెట్ల కోసం బెదిరించిన జగన్మోహన్ రావు అరెస్ట్**

ఐపీఎల్‌లో ఉచిత టిక్కెట్ల కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ ను బెదిరించినట్లుగా విజిలెన్స్ దర్యాప్తులో తేలింది. వీరి నివేదిక ఆధారంగా సీఐడీ కేసులు పెట్టి అరెస్టు చేసింది. ఐపీఎల్ జరుగుతున్న సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జనరల్ మేనేజర్ (స్పోర్ట్స్) శ్రీనాథ్ , అధ్యక్షుడు జగన్మోహన్ రావుపై ఉచిత ఐపీఎల్ టిక్కెట్ల కోసం "బెదిరింపు, బలవంతం, బ్లాక్‌మెయిల్" చేస్తున్నారని ఆరోపించారు. మార్చి 27, 2025న లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్ రోజున అధికారులు F3 కార్పొరేట్ బాక్స్‌ను లాక్ చేశారని, అదనపు 20 ఉచిత టిక్కెట్లు ఇవ్వక పోతే దాన్ని తెరవబోమని బెదిరించారని సన్ రైజర్స్ ఆరోపించింది. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం సామర్థ్యం 39,000 కాగా, ఒప్పందం ప్రకారం 10% (3,900) టిక్కెట్లు ఉచితంగా అందించాలి. అయితే, జగన్మోహన్ రావు ఈ 3,900 టిక్కెట్లతో పాటు అదనంగా 2,500-3,900 టిక్కెట్లను తనకు వ్యక్తిగతంగా ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారని సన్ రైజర్స్ ఆరోపించింది. ఈ డిమాండ్‌ను తిరస్కరించడంతో వివాదం తీవ్రమైంది. ఈ విషయంలో వైఖరి మారకపోతే, హైదరాబాద్ నుంచి తమ హోమ్ మ్యాచ్‌లను వేరే వేదికకు మార్చాలని తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేస్తామని శ్రీనాథ్ హెచ్చరించారు. జగన్మోహన్ రావు వ్యక్తిగతంగా 3,900 టిక్కెట్లను కొనుగోలు కోసం బ్లాక్ చేయమని అడగలేదని స్పష్టం చేసింది. ఫిబ్రవరి 19, 2025న జరిగిన చర్చలలో, అపెక్స్ కౌన్సిల్ తరపున క్లబ్ సెక్రటరీలకు టిక్కెట్లు అందించాలని ప్రతిపాదించారని . F3 బాక్స్ లాక్ చేయడం సన్ రైజర్స్ అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిందని, చర్చల తర్వాత ఈ సమస్య కొన్ని గంటల ముందు పరిష్కారమైందని వాదించింది. వివాదం తీవ్రమవడంతో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి సన్ రైజర్స్‌చేసిన ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ కొత్తకోట శ్రీనివాస రెడ్డికి విచారణ జరపాలని ఆదేశించారు. విచారణలో జగన్మోహన్ రావు బెదిరించినట్లుగా తేలింది. ఐపీఎల్ సీజన్‌లో నిర్వహించడానికి కు ఒక్కో మ్యాచ్‌కు రూ. 1 కోటి చెల్లిస్తుంది. స్టేడియం పెయింటింగ్, టాయిలెట్‌ల సర్వీసింగ్, ఏసీల స్థాపన వంటి మరమ్మతులనుసన్ రైజర్స్ నిర్వహించినప్పటికీ తామే చేయించిటన్లగా జగన్మోహన్ రావు ప్రచారం చేసుకున్నారని సన్ రైజర్స్ ఆరోపించింది. 2023లో జగన్మోహన్ రావు అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుంచి పలు వివాదాల్లో ఇరుక్కున్నారు. గుర్తింపు లేని క్లబ్ తరపున పోటీ చేసి గెలిచారని కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.



# బెట్టింగ్ యాప్స్

- సెలబ్రిటీలపై కేసు నమోదు చేసిన ఈడీ!

**జయభేరి, హైదరాబాద్, జూలై 10:**

బెట్టింగ్ యాప్స్ కేసు కొత్త మలుపు తీసుకుంది. స్టార్ హీరోలు రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండతో పాటు ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్, హీరోయిన్లు నిధి అగర్వాల్, ప్రణీత సుభాష్ అనన్య నాగళ్ల సహా 29 మంది సెలబ్రిటీల మీద గతంలో సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇందులో ఈడీ ఎంటర్ అయ్యింది. సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా సినీ సెలబ్రిటీల బెట్టింగ్ యాప్స్ కేసును ఇన్వెస్టిగేట్ చేయడానికి ఈడీ రెడీ అయింది. ఇప్పుడు సెలబ్రిటీలు అందరినీ విచారణకు మళ్లీ ఆ కేసు విషయమై పిలిచేందుకు సిద్ధమైంది. దాంతో ఆ 29 మంది సెలబ్రిటీలకు కొత్త చిక్కులు తప్పేలా కనిపించడం లేదు. పోలీసులు విచారణ తర్వాత కేసు పురోగతి ఏమైందనేది ఎవరికి తెలియదు. ఇప్పుడు ఈడీ ఎంటర్ అవ్వడంతో ఈ కేసు ఎటు వైపుకు వెళుతుందనే ఆసక్తి అందరిలో నెలకొంది.బెట్టింగ్ యాప్స్ కేసు గురించి క్లుప్తంగా చెప్పాలంటే... ఇల్లీగల్ యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోమని సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు ప్రమోట్ చేయడం వల్ల సామాన్యులు చాలామంది వాటిని డౌన్‌లోడ్ చేసుకున్నారు. వందలు, వేలు నుంచి లక్షల రూపాయలు కోల్పోయిన వారు ఉన్నారు. కొందరు ఆత్మహత్యలు సైతం చేసుకున్నారు. సదరు యాప్స్ ప్రమోట్ చేసినందుకు సెలబ్రిటీలు భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాష్ రాజ్, నిధి అగర్వాల్, ప్రణీత సుభాష్, అనన్య నాగళ్ళ, లక్ష్మీ మంచుతో పాటు వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల, బుల్లితెర నటుల్లో విష్ణు ప్రియ భీమనేని, రీతూ చౌదరి, శ్రీముఖి, వర్షిని సౌందరరాజన్, సిరి హనుమంతు, సురేఖ వాణి కుమార్తె బండారు సుప్రీతా నాయుడు, 'బిగ్ బాస్' ఫేమ్ టేస్టీ తేజ, వాసంతి కృష్ణన్, 'కార్తీక దీపం' ఫేమ్ శోభా శెట్టి, అమృత చౌదరి, నయనీ పావని, నేహా పఠాన్, హర్ష సాయి తదితరులు ఉన్నారు. యువతను ఆకట్టుకునేందుకు బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు..యూట్యూబర్లు, టాలీవుడ్, బాలీవుడ్ నటులతో ప్రమోషన్ చేయిస్తున్నారు. దీని కోసం వారికి లక్షల్లో, కోట్లల్లో చెల్లిస్తున్నారు. అయితే యాప్ ప్రమోషన్‌కు సంబంధించిన మొత్తాన్ని ఐటీ రిటర్న్‌లలో లెక్కలు చూపించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మనీ లాండరింగ్ కింద ఈడీ కేసు నమోదు చేసింది. మరోవైపు సెలబ్రిటీలు వారు ప్రమోట్ చేసిన వీడియోలను సోషల్‌మీడియా యాప్స్‌లో సర్క్యులేట్ చేస్తున్నారు. వారికి లక్షల సంఖ్యలో ఫాలోవర్స్ ఉండడంతో బెట్టింగ్ యాప్స్ వేగంగా జనాల్లోకి వెళ్లిపోతున్నాయి.ఈజీమనీ వేటలో అనేకమంది బెట్టింగ్‌కి అడిక్ట్ అవుతున్నారు. లక్కు కలిసి వస్తుందనే ఆశతో లక్షల రూపాయలు బెట్టింగ్‌లకు తగలేస్తున్నారు. ఉన్నతోద్యోగుల నుంచి రోజుకూలీల వరకు, గృహిణుల నుంచి విద్యార్థుల వరకు చాలామంది ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలవుతున్నారు. చివరకు లక్షల్లో కనిపిస్తున్న అప్పులను తీర్చే మార్గం కనిపించక..మరోవైపు సొంతవారికి ముఖం చూపించ లేక..బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.తెలుగురాష్ట్రాల్లో రోజుకో చోట వినిపిస్తున్న ఈ బెట్టింగ్ మరణాలు..అందర్నీ కలచివేస్తోన్నాయి. బెట్టింగ్ యాప్ దారుణాలపై భారీ యుద్ధమే చేసింది టీవీ9. దీంతో స్పందించిన తెలంగాణ ప్రభుత్వం..బెట్టింగ్ యాప్స్‌తో పాటు వాటిని ప్రమోట్ చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు మొదలు పెట్టింది. ఇప్పుడు ఈ వ్యవహారంలోకి ఈడీ కూడా ఎంటర్ అవడంతో బెట్టింగ్ ప్రమోటర్లకు చుక్కలు కనిపించడం ఖాయంగా కనిపిస్తోంది.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 నుంచి 34 శాతం జీతాలు పెంపు




**జయభేరి, న్యూఢిల్లీ, జులై 10:**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కారు శుభవార్త చెప్పింది. 8వ వేతన సంఘం ఇచ్చే నివేదిక ఆధారంగా ఉద్యోగుల జీతాలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఒక చర్చ సాగుతోంది. దీని ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 నుంచి 34 శాతం జీతాలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. పెరిగిన ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని వేతన సంఘం ఈ మేరకు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ఈ పెంచిన జీతాలు 2026 జనవరి నుంచి అమలులోకి వచ్చే అవకాశం ఉంది.ఈ 8వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం వేతనాలు పెంచినట్లయితే.. దాదాపు 11 మిలియన్ల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ఇదిలాఉంటే.. ప్రతి పదేళ్లకు ఒకసారి వేతన సంఘాన్ని కేంద్రం నియమిస్తున్న సంగతి తెలిసిందే. 2016లో మోదీ సర్కార్ 7వ వేతన సంఘాన్ని నియమించింది. అప్పుడు అత్యల్పంగా 14 శాతం మేర జీతాలను పెంచారు. మళ్లీ ఈ ఏడాది 8వ వేతన సంఘాన్ని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ సంఘం సిఫారసు మేరకు ఉద్యోగుల వేతనాలను పెంచనున్నారు.

# మెగా పీటీఎం కు హజరయిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

**జయభేరి, కొత్తచెరువు:**

శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం 2.0 కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధిపొందిన తల్లులు, విద్యార్థులతో ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్ ముఖాముఖి అయ్యారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు పరిశీలించి విద్యార్థులు, తల్లిదండ్రులకు సీఎం పలు సూచనలిచ్చారు. డిజిటల్ తరగతి గదిలో విద్యార్థులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. సహజ వనరులు, పునరుద్పాదక వనరుల గురించి విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పాఠం చెప్పారు.

# వివాహేతర సంబంధ

- తండ్రిన చంపేసిన కూతురు, సహకరించిన తల్లి

**జయభేరి, హైదరాబాద్, జూలై 10:**

వివాహేతర సంబంధాలకు అడ్డుగా ఉన్నాడని భర్తను చంపేసే భార్యలను ఇప్పటి వరకు చూశాం. కానీ ఇది తండ్రిని హత్య చేసిన కుమార్తె కథ. తండ్రిని చంపేసి హ్యాపీగా ప్రియుడితో కలిసి రెండో ఆట సినిమాకు వెళ్లిందా కుమార్తె. వచ్చిన తర్వాత డెడ్‌బాడీని మాయం చేసింది. ముందు విచారణలో ఆమె చెప్పిన స్టోరీకి తర్వాత విచారణలో వెలుగు చూసిన దారుణం గురించిన తెలిసిన పోలీసులే షాక్ తిన్నారు. హైదరాబాద్ శివారులోని ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ చెరువులో మూడు రోజుల క్రితం ఓ డెడ్‌బాడీ కనిపించింది. దీన్ని గమనించిన స్థానికులు విషయాన్ని పోలీసులకు చేరవేశారు. రంగ ప్రవేశం చేసిన పోలీసులు డెడ్‌బాడీని బయటకు తీసి పోస్టుమార్టానికి పంపించారు. బాడీపై ఉన్న గాయాలతోపాటు పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా అది హత్యగా తేల్చారు. చనిపోయింది కవాడిగూడకు చెందిన వడ్లూరి లింగం అని గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రాథమికంగా ఏం జరిగిందని వారిని ప్రశ్నించారు. పోలీసుల విచారణలో లింగం కుమార్తె మనిషా, ఆయన భార్య శారద చాలా పెద్ద స్టోరీయే చెప్పారు. 6న ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు వివరించారు. నిత్యం తాగుతూ వేధిస్తున్నాడని ప్రతి ఒక్కరితో గొడవలు పడుతున్నట్టు కూడా తెలిపారు. లింగం కుటుంబ సభ్యుల తడబాటు, వారి ప్రవర్తనపై పోలీసులకు అనుమానం వచ్చింది. ఆ దిశగానే కేసులు దర్యాప్తు చేపట్టారు. చెరువు సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించడంతో అసలు గుట్టంతా వెలుగులోకి వచ్చింది. స్పాట్‌లో కుమార్తె ఉన్నట్టు గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకొని విచారిస్తే మొత్తం కుట్రను పూసగుచ్చినట్టు చెప్పేసింది. వివాహేతర బంధానికి అడ్డుతగులుతున్నాడనే ప్రియుడు, తల్లితో కలిసి తండ్రిని హత్య చేసినట్టు మనీషా చెప్పింది. పాతబస్తీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో లింగం సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. భార్య శారద జీహెచ్ఎంసీలో స్వీపర్‌గా ఉన్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇందులో పెద్దకుమార్తె మనీషాకు వివాహం చేసి పంపించారు. కానీ ఆమె భర్త స్నేహితుడు మహ్మద్ జావీద్ అనే వ్యక్తితో వివాహేతర బంధం పెట్టుకుంది. మనీషా వివాహేతర సంబంధంపై చాలా కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆమె ప్రవర్తనతో విసిగిపోయిన భర్త వదిలి వెళ్లిపోయాడు. భర్త వదిలేసి వెళ్లిపోవడంతో మనీషా ప్రియుడితో కలిసి మౌలాలీలో నివాసం ఉంటుంది. ఇలా బహిరంగంగా తిరగడంపై తండ్రి చాలా సార్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. పద్ధతిగా ఉండాలంటూ చెప్పాడు. తండ్రి పదే పదే తన వివాహేతర సంబంధంపై మాట్లాడటం మనీషాకు నచ్చలేదు. ఇదే విషయాన్ని తల్లి శారద వద్ద చెప్పింది. అయితే తనకి కూడా వివాహేతర సంబంధాలు ఉన్నాయని లింగం అనుమానిస్తున్నట్టు తల్లి చెప్పింది. తమ దారికి అడ్డు వస్తున్న లింగంను హత్య చేస్తే అన్నింటికి పరిష్కారం దొరుకుతుందని అనుకున్నారు. మనీషా ప్లాన్‌కు తల్లి శారద కూడా ఓకే చెప్పింది. అంతే ప్రియుడితో కలిసి తండ్రిని హత్య చేసేందుకు స్కెచ్ వేసింది మనీషా. ఐదో తేదీన నిద్ర మాత్రలు తీసుకొచ్చి తల్లికి ఇచ్చింది మనీషా. వాటిని కల్లులో కలిపి భర్తకు ఇచ్చింది భార్య శారద. అంతే గాఢ నిద్రలోకి జారుకున్నాడు లింగం. నిద్రలో ఉన్న లంగంను మనీషా, జావీద్, శారద కలిసి హత్య చేశారు. ముఖంపై దిండు పెట్టి ఊపిరి ఆపేశారు. హత్య చేసిన తర్వాత ప్రియుడితో కలిసి సెకండ్‌షో సినిమాకు వెళ్లారు. అనంతరం క్యాబ్‌లో వచ్చి డెడ్‌బాడీని మాయం చేశారు. ఇంట్లో ఉన్న డెడ్‌బాడీని ఎక్కిస్తున్న టైంలో క్యాబ్ డ్రైవర్‌కు అనుమానం వచ్చింది. ఏం అయిందని అడిగితే ఫుల్‌గా తాగేసి మత్తులో ఉన్నాడని కవర్ చేశారు. ఆ డెడ్‌బాడీని తీసుకొని ఎదులాబాద్ వద్ద దిగిపోయారు. క్యాబ్ డ్రైవర్ వెళ్లి పోయిన తర్వాత డెడ్‌బాడీని ముగ్గురు కలిసి స్థానికంగా ఉన్న చెరువులో పడేశారు.చెరువులో డెడ్‌బాడి కుళ్లిపోయే స్థితికి చేరుకుంటుందని తర్వాత ఎవరూ గుర్తు పట్టలేరని అనుకున్నారు. కానీ రెండు రోజుల తర్వాతే డెడ్‌బాడీ పైకి తేలుతూ కనిపించింది. దీంతో అసలు గుట్టు రట్టు అయింది. ఈ కేసులో మనీషా, శారద, జావీద్‌ను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. రిమాండ్‌కు పంపించారు.

# ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు అందించడమే లక్ష్యం

- గత పాలకులు ఇల్లు రేషన్ కార్డులు ఇచ్చిన పాపాన పోలేదు.
- స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ కు కర్రు కాల్చి వాత పెట్టడం తథ్యం.
- ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని దశాల వారిగా అమలు చేస్తాం.
- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండమండలం లోని తాటికోల్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని విధంగా రైతన్నల సంక్షేమం కోసం 9 రోజుల్లో 9 వేల కోట్లు పెట్టుబడి సాయాన్ని అందించింది మన ప్రజా ప్రభుత్వం అని పేర్కొన్నారు. పేద ప్రజలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి.. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఆశీర్వాదం మరింత ప్రోత్సాహాన్నిస్తుంది అని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించడం కోసం కృషి చేస్తున్నామని అలాగే సంవత్సరం నర కాలంలోనే ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తున్నామని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ లు నిర్మాణలు చెప్పట్టడం జరుగుతుందని గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు మౌళిక వసతులు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నాం అని అన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 14 వ తేదీన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీద అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమం శ్రీకారం చుట్టబోతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటీసీలు, మాజీ కోఆప్షన్ సభ్యులు, NSUI నాయకులు,వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, అధికారులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ తో అధిక లాభాలు

- ఎమ్మెల్యే బాలు నాయక్

**జయభేరి, కొండమల్లేపల్లి :**

ఆయిల్ ఫామ్ తో అధిక లాభాలు, వస్తాయని, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం రోజు ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ నల్లగొండ ఆధ్వర్యంలో కొండ మల్లేపల్లి మండల కేంద్రం లోని నాయిని జమున





మాధవరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్ లో భాగంగా ఆయిల్ ఫామ్ మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను నాటినారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి ద్వారా అధిక లాభాలు పొందొచ్చని ఆయన అన్నారు ఆయిల్ ఫామ్ మొక్కను ఒకసారి నాటితే నాలుగు సంవత్సరాల నుండి 30 సంవత్సరాల వరకు సరాసరిన ఎకరానికి 10 నుండి దిగుబడి చేసుకోవచ్చని మరి ఎకరానికి లక్ష 20 వేల నుండి 1,50,000 కు నిఖిర ఆదాయాన్ని పొందవచ్చు అని అలాగే ఈ పంటకు జంతువుల నుండి గాని దొంగల నుండి గాని ఎటువంటి విడత ఉండదు అని అన్నారు. ఆయిల్ ఫామ్ వేసిన ప్రతి రైతు ఈ పంట నుండి ప్రతినెల ఆదాయాన్ని తీసుకునే సౌకర్యం కలదు మిగతా పంటలతో పోల్చినప్పుడు ప్రకృతి వైపరీత్యాలు మరియు చీడపీడల నుండి తట్టుకున్న శక్తి చాలా ఉంటుందని తెలిపారు.

అనంతరం డి హెచ్ ఎస్ ఓ అనంతరెడ్డి మాట్లాడుతూ ఈ పంట సాగుకు ప్రభుత్వం 100% రాయితీ మొక్కలు సరఫరా చేస్తూ మొక్కకు నీరు అందించే డ్రిప్ పరికరాలను కూడా అందిస్తుందని మొదటి నాలుగు సంవత్సరాలకు మొక్కల యాజమాన్యానికి ఎగరానికి 4000చొప్పున ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రైతు ఖాతాలో జమ చేయబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జమున రెడ్డి వుద్యాన అధికారి రవి నాయక్ రిషిత మాజీ ఎంపీపీ రేఖా రెడ్డి పిఎస్ఈఎస్ చైర్మన్ రేవంత్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.




# కాంతార ముందు జరిగిన కథ

'కాంతార' చిత్రానికి దేశవ్యాప్తంగా ఆదరణ దక్కింది. దక్షిణ కన్నడ సంస్కృతి, ఆచార వ్యవహారాలను ఆవిష్కరిస్తూ డివోషనల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ప్రస్తుతం ఈ చిత్రానికి 'కాంతార చాప్టర్ 1'పేరుతో ప్రీక్వెల్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'కాంతార' ముందు జరిగే కథ ఇది. సోమవారం చిత్ర కథానాయకుడు, దర్శకుడు రిషబ్‌శెట్టి పుట్టిన రోజు సందర్భంగా సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని, డివైన్ సినిమాటిక్ విజువల్ వండర్‌గా ఆకట్టుకుంటుందని, అక్టోబర్ 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నామని మేకర్స్ తెలిపారు. 'కాంతారా ఛాప్టర్ 1' చిత్రం కోసం అంతర్జాతీయ సాంకేతిక నిపుణులు పనిచేశారని, 500 మంది ఫైటర్లు, 3000 మంది జూనియర్ ఆర్టిస్టులతో తీసిన యుద్ధ ఘట్టం భారతీయ సినిమా చరిత్రలోనే ఓ రికార్డని మేకర్స్ పేర్కొన్నారు. హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.

# సూర్య సినిమాకు రెహమాన్ సంగీతం



డైరెక్షన్‌కి పదేళ్లపాటు దూరంగా ఉన్న ఎస్.జె. సూర్య ఎట్టకేలకు మళ్లీ మెగాఫోన్ పట్టారు. స్వీయ దర్శకత్వంలో నటిస్తూ 'కిల్లర్' పేరుతో ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారాయన. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీగోకుల్ మూవీస్, ఎస్.జె.సూర్య సొంత నిర్మాణ సంస్థ ఏంజెల్ స్టూడియోస్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఏ.ఆర్.రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తుండటం విశేషం. దీన్నిబట్టి ఈ సినిమాలో సంగీతానికి ఎంత ప్రాధాన్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎస్.జె.సూర్య, రెహమాన్ కాంబినేషన్లో ఇది అయిదవ చిత్రం కావడం గమనార్హం. అన్ని భాషలవారికీ కనెక్టయ్యే కథతో ప్రస్టేజియస్‌గా ఈ పాన్ ఇండియా సినిమాను తెరకెక్కిస్తున్నామని, అయిదు భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాతలు వి.సి.ప్రవీణ్, బైజు గోపాలన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కృష్ణమూర్తి.




# చిలిపి అంటూ సిగ్గుపడిన నిధి..

అందాల భామ నిధి అగర్వాల్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ జోష్ లో ఉంది. సవ్యసాచి సినిమాతో హీరోయిన్ గా పరిచయమైన ఈ చిన్నది ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. కానీ అంతగా సక్సెస్ మాత్రం అందుకోలేకపోయింది. ఆ సమయంలో పూరిజగన్నాథ్, రామ్ పోతినేని కాంబినేషన్ లో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమా ఈ అమ్మడికి మంచి విజయాన్ని అందించింది. ఇస్మార్ట్ శంకర్ సినిమాలో తన అందాలతో కవ్వించింది నిధి. ఆతర్వాత షరామామూలే.. నిధి అగర్వాల్ ఆతర్వాత హిట్ రుచి చూడలేదు. ఇక ఇప్పుడు ఏకంగా ఇద్దరు స్టార్ హీరోల సినిమాల్లో నటించే ఛాన్స్ కొట్టేసింది. వాటిలో ఒకటి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న హరిహరవీర మల్లు. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. హరిహరవీరమల్లు సినిమా కోసం నిధి గుర్రపు స్వారీ, కత్తి యుద్ధంలాంటివి నేర్చుకుంది ఈ చిన్నది. ఈ సినిమా తర్వాత ప్రభాస్ హీరోగా నటిస్తున్న రాజా సాబ్ సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ కూడా శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమాలో ప్రభాస్ డ్యూయల్ రోల్ లో కనిపించనున్నాడు. ఇటీవలే ఈ సినిమా నుంచి టీజర్ విడుదలైంది. ఇదిలా ఉంటే ఇటీవలే వెంకటేష్ త్రివిక్రమ్ సినిమాలోనూ నిధి అగర్వాల్ ను హీరోయిన్ గా ఫిక్స్ చేశారని కూడా టాక్ వినిపిస్తుంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ అభిమానులతో అప్పుడప్పుడూ ముచ్చటిస్తూ ఉంటుంది. సోషల్ మీడియాలో అభిమానులతో చిట్ చాట్ చేస్తున్న సమయంలో ఓ అభిమాని చేసిన పనికి తాను షాక్ అయ్యాను అని తెలిపింది నిధి. అభిమానులతో మాట్లాడుతుండగా ఓ ఫ్యాన్ మ్యారేజ్ టాపిక్ తీసుకొచ్చాడు అని తెలిపింది. " మీ అమ్మగారి నెంబర్ ఇవ్వండి. మన పెళ్లి సంబంధం గురించి మాట్లాడతా. ప్లీజ్ ఇవ్వొచ్చుగా నిధి" అని అడిగాడట. దానికి నిధి అగర్వాల్ అవునా? చిలిపి.. అంటూ సమాధానం ఇచ్చింది.



# అబ్బో.. అందాల అరాచకం..

స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ఇటీవలే లక్కీ భాస్కర్ సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించింది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ సినిమా మంచి వసూళ్లు రాబట్టింది. ఈ సినిమా పాన్ ఇండియాలో సూపర్ డూపర్ హిట్ అయింది. 2012లో విడుదలైన 'సెకండ్ షో' చిత్రంతో దుల్కర్ తన నట జీవితాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత విడుదలైన 'ఉస్తాద్ హోటల్' సినిమా అభిమానుల మదిలో చెరగని స్థానాన్ని సంపాదించుకుంది. ఇక తెలుగులోకి ఒకే బంగారం సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించాడు. ఈ సినిమా తెలుగులో మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత దుల్కర్ నటించిన సినిమాలు తెలుగులోనూ విడుదలై మంచి విజయాలను అందుకుంది. దుల్కర్ సల్మాన్ మళ్లీ తెలుగు దర్శకుడితో పని చేస్తున్నారని తెలుస్తుంది. ఈ సినిమాకు ఆకాశంలో ఓ తార అనే టైటిల్ ను ఖరారు చేశారు. ఈ సినిమాలో హీరోయిన్ గా అందాల భామ రుహానీ శర్మ నటిస్తుందని తెలుస్తుంది. తెలుగులో చిలసౌ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించింది ఈ ముద్దుగుమ్మ. మొదటి సినిమాతోనే తెలుగు కుర్రాళ్ల హృదయాలను దోచేసింది హీరోయిన్ రుహానీ శర్మ. టాలీవుడ్ ఇండస్ట్రీలో అడపాదడపా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈ బ్యూటీ.. ఇప్పుడు దుల్కర్ సినిమాలో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది.

# తమిళ రీమేక్ చిత్రంలో నాగార్జున?



నాగార్జున తన కెరీర్‌లో కీలకమైన మైలురాయికి చేరువయ్యారు. త్వరలోనే 100వ చిత్రం చేయబోతున్నారాయన. న్యూ టాలెంట్‌తో పనిచేసేందుకు ఉత్సాహం చూపించే నాగ్.. తమిళంలో ఒకే ఒక్క సినిమాను తెరకెక్కించిన రా.కార్తీక్‌కి తన 100వ చిత్రం బాధ్యతను అప్పగించారట. ఇదిలా వుంటే.. మరోవైపు నాగ్ ఓ రీమేక్ చేయబోతున్నట్టు ఫిల్మ్‌నగర్‌లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. తమిళంలో శశికుమార్ నటించిన 'అయోతి' చిత్రాన్ని రీమేక్ చేసేందుకు నాగ్ ఆసక్తి చూపిస్తున్నారట. 2023లో విడుదలైన ఈ మెలోడ్రామాటిక్ సినిమాకు మంత్రి రామ్మూర్తి దర్శకుడు. ఈ సినిమా కథ, కథనం, ఎమోషన్స్ గురించి తమిళ ప్రేక్షకులు ప్రత్యేకంగా మాట్లాడుకున్నారనీ, తమిళనాట విమర్శకుల ప్రశంసలందుకోవడంతో పాటు వాణిజ్యపరంగా కూడా ఈ సినిమా ఘన విజయం సాధించిందనీ, అందుకే ఆ సినిమాను రీమేక్ చేసేందుకు నాగ్ ఉత్సాహం కనపరుస్తున్నారని ఫిల్మ్ సర్కిల్స్‌లో వార్త బలంగా వినిపిస్తున్నది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. మరి ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేస్తే.. దర్శకుడిగా మంత్రి రామ్మూర్తే ఉంటారా? లేక వేరొకర్ని తీసుకుంటారా? అనేది తెలియాల్సివుంది. ఆగస్ట్ 29న నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా ఆయన 100వ సినిమాతోపాటు ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ కూడా వచ్చే అవకాశం ఉంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com